

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 208 | సోమవారం 03- 08 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


## ఏపీ-ఆస్ట్రేలియా..
# కొత్త అధ్యాయం

### మంత్రి లోకేశ్ చొరవతో 4 ఎంఓయూలు


- ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య నాలుగు కీలక రంగాల్లో వ్యూహాత్మక ఒప్పందాలు
- గతంలో మంత్రి లోకేశ్ పర్యటనకు కొనసాగింపుగా కుదిరిన ఎంఓయూలు
- ఏపీలో సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- ఆటిజం విద్య, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- యువతకు ప్రపంచస్థాయి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్న మంత్రి లోకేశ్

అమరావతి నందిపత్రిక

ంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య సంబంధాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇరుప్రాంతాల మధ్య అభివృద్ధి, నైపుణ్యం, ఆవిష్కరణలే లక్ష్యంగా నాలుగు కీలక రంగాల్లో వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదిరాయి. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్, ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అభివృద్ధి, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి



## అదనపు పన్నుల వాటా కేటాయింపు..
### కేంద్రానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు



ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం అదనపు పన్నుల వాటాను విడుదల చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో అందిన ఈ ఆర్థిక చేయూత రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలాన్ని ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన కేంద్రం నుంచి రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల

- ఏపీకి కేంద్రం నుంచి రూ.4,597 కోట్ల అదనపు పన్నుల వాటా విడుదల
- నిధులు కేటాయించినందుకు ప్రధానికి, ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు
- సాధారణ తేదీ కంటే ముందుగానే నిధులు విడుదల చేయడంపై హర్షం
- ఈ సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతాయని వెల్లడి
- కేంద్ర సహకారం రాష్ట్ర పురోగతికి ఎంతో దోహదపడుతుందని సీఎం పేర్కొన్నారు

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?



- రాష్ట్రంలో అరాచక పాలన పరాకాష్టకు చేరిందని జగన్ విమర్శ
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారని ఆగ్రహం
- సీదిరి అప్పలరాజు, ముస్తఫాపై అక్రమ కేసులు బనాయించారని ధ్వజం
- ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చడానికే దాడులు, అరెస్టులని విమర్శ
- ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసిన జగన్

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, 'నారాసుర పాలన'లో అరాచకం పరాకాష్ఠకు చేరిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాడి చేసిన అధికార పార్టీ వారికి రక్షణ కల్పిస్తూ, బాధితులైన ప్రతిపక్ష నేతలపైనే హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యమా, పోలీస్ రాజ్యమా లేక జంగిల్ రాజ్యమా అని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. ఆలూరు బీసీ ఎమ్మెల్యే విరూపాక్షిని అర్ధరాత్రి అరెస్ట్ చేసిన తీరుపై జగన్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. "ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా? అర్ధరాత్రి 2:45 గంటలకు వందలాది పోలీసులతో ఇంటిపై దాడి చేసి, తలుపులు బద్దలుకొట్టి అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని జగన్ నిలదీశారు.




### అమ్మకాలు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల
# బియ్యం

- సామాన్యులకు ఊరటనిస్తూ ప్రభుత్వ బియ్యం అమ్మకాలు
- విజయవాడలో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- రైతు బజార్లు, మిల్లుల్లో కేజీ రూ. 50, రూ. 52కే బియ్యం
- త్వరలో కందిపప్పు, పామాయిల్ కూడా తక్కువ ధరకే

రాష్ట్రంలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పిస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించేందుకు, తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 130 రైతు బజార్లు, 500 రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక కౌంటర్ల ద్వారా సబ్సిడీ బియ్యం విక్రయాలను ఆదివారం ప్రారంభించింది. విజయవాడలోని ఏపీఐఐసీ రైతు బజార్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి, ప్రజలకు స్వయంగా బియ్యాన్ని అందజేశారు. ఈ పథకం కింద బీపీటీ సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ. 52కు, బీపీటీ రా రైస్‌ను కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు. ఆధార్ కార్డు చూపించి ఒక వ్యక్తి 10 కిలోల వరకు బియ్యం కొనుగోలు చేయవచ్చు. బహిరంగ మార్కెట్‌లో రూ. 60 నుంచి రూ. 65 వరకు పలుకుతున్న ఈ రకం బియ్యాన్ని ప్రభుత్వం తక్కువ ధరకే అందుబాటులోకి తేవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ..

## వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్..



## ఇంటింటికీ టీడీపీ: ఏడు రోజుల్లో 17.61 లక్షల ఇళ్లకు..
### ప్రభుత్వంపై విశ్వాసానికి నిదర్శనమన్న లోకేశ్

- 7 రోజుల్లో 17.61 లక్షల కుటుంబాలను కలిసిన కూటమి శ్రేణులు
- ఆదివారం సెలవు రోజైనా 3 లక్షలకు పైగా గృహాలను సందర్శించిన నేతలు
- టెలీకాన్ఫరెన్స్ ద్వారా పురోగతిని సమీక్షించిన రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- టెక్నాలజీతో కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన నారా లోకేశ్



## లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి..
## మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు



- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్
- ప్రభుత్వం తరఫున జగన్మాతకు పట్టువస్త్రాలు, బోనం సమర్పణ
- ముఖ్యమంత్రితో పాటు పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క
- అంగరంగ వైభవంగా జరుగుతున్న లష్కర్ బోనాల జాతర

సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆయన జగన్మాతకు



## వికసిత భారత్ కోసం
# డ్రగ్స్‌కు దూరం..



- వికసిత భారత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా 'నశా ముక్త్ యువ' ప్రారంభం
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 2047 నాటికి వికసిత భారత్ సాధనకు ఆరోగ్యవంతమైన యువత అవసరమని స్పష్టీకరణ
- దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం క్రీడలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైనట్లు వెల్లడించిన ప్రధాని

దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా, శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే 'వికసిత భారత్' సంకల్పం నెరవేరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో నేటి తరం యువత చూపిస్తున్న నిబద్ధత, సామాజిక స్పృహ తన నమ్మకాన్ని మరింత బలపరిచాయని ఆయన ప్రశంసించారు.

## కోర్టు తీర్పుతో ఎదురుదెబ్బ..



- కర్ణాటక బీజేపీ ఎమ్మెల్సీ ఎం.కె.ప్రాణేష్ రాజీనామా
- 2021 ఎన్నిక చెల్లదని కోర్టు తీర్పు
- రీకౌంటింగ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గాయత్రి శాంతేగౌడ విజయం
- నామినేటెడ్ సభ్యుల ఓట్లపై వివాదంతో మారిన ఫలితం
- పరిషత్ వైస్-ఛైర్మన్ పదవికి కూడా ప్రాణేష్ రాజీనామా

# లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి..

## మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు

బోనం, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లష్కర్ బోనాల జాతరలో భాగంగా ఆలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భగుడిలో మహంకాళి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా పాల్గొన్నారు. వారు కూడా అమ్మవారికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆలయ పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం..

నేడు 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'మై భారత్' వాలంటీర్ల నేతృత్వంలో ఇది ఒక ప్రజా భాగస్వామ్య (జన్ భాగీదారీ) ఉద్యమంగా రూపుదిద్దుకుంది. "మనం ఒక గొప్ప, ముఖ్యమైన సంకల్పం కోసం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం లేదా సమాజం కోసం కాదు. ఇది దేశం కోసం. వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తున్నప్పుడు, యువత డ్రగ్స్ సమస్యకు దూరంగా ఉండటం అత్యవసరం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాశీతో ఈ కార్యక్రమానికి ఉన్న అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. "కాశీ ఎంపీగా, ఈ కార్యక్రమం గతేడాది పవిత్ర కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. దీనివల్ల ఈ కార్యక్రమానికి శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, సాధువుల ఆశీస్సులు, సాంస్కృతిక వారసత్వం కూడా తోడయ్యాయి" అని ఆయన అన్నారు. 2025 జులైలో వారణాసిలో జరిగిన యూత్ స్పిరిచ్యువల్ సమ్మిట్‌లో దేశంలోని 125 ఆధ్యాత్మిక సంస్థలు ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌తో 'కాశీ డిక్లరేషన్'ను ఆమోదించాయని, వారంతా లక్షలాది పౌరులకు సేవ చేస్తున్నారని మోదీ వివరించారు. యువతను దేశానికి 'అమృత తరం' (అమృత్ పీఢీ)గా అభివర్ణించిన ప్రధాని.. "రాబోయే 20-25 ఏళ్లలో మీ జీవితాలకు మీరే దిశానిర్దేశం చేసుకుంటారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసేది మీరే. ఆ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేది కూడా మీరే. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి దేశం కోసం, మీ సొంత జీవితాల కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండండి" అని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, ధ్యాన శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతే వికసిత భారత్‌కు అసలైన బలం' అనే సందేశాన్ని దేశంలోని ప్రతి యువకుడికి చేర్చడమే ఈ ఉద్యమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# కోర్టు తీర్పుతో ఎదురుదెబ్బ..

కర్ణాటక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కోర్టులో చుక్కెదురు కావడంతో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేత, కర్ణాటక విధాన పరిషత్ వైస్-ఛైర్మన్ ఎం.కె.ప్రాణేష్ తన ఎమ్మెల్సీ పదవికి, వైస్-ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. 2021లో జరిగిన ఎన్నికను కర్ణాటక హైకోర్టు రద్దు చేయడంతో పాటు, సుప్రీంకోర్టులోనూ ఊరట లభించకపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. 2021లో చిక్కమగళూరు స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రాణేష్ కేవలం 6 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి గాయత్రి శాంతేగౌడపై గెలిచినట్లు ప్రకటించారు. అయితే, స్థానిక సంస్థల్లోని నామినేటెడ్ సభ్యులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు లేదని, వారి ఓట్లను పరిగణనలోకి తీసుకోవడం చెల్లదని గాయత్రి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, గాయత్రి వాదనతో ఏకీభవించింది. నామినేటెడ్ సభ్యులు వేసిన 12 ఓట్లను మినహాయించి, మిగిలిన ఓట్లను తిరిగి లెక్కించాలని ఆదేశించింది. రీకౌంటింగ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గాయత్రికి 1,183 ఓట్లు, ప్రాణేష్‌కు 1,174 ఓట్లు వచ్చాయి. దీంతో గాయత్రి శాంతేగౌడ 9 ఓట్ల తేడాతో గెలిచినట్లు హైకోర్టు జులై 31న తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ప్రాణేష్ సుప్రీంకోర్టును ఆశ్రయించినా, అక్కడ కూడా ఆయన అప్పీల్‌ను ధర్మాసనం కొట్టివేసింది. దీంతో న్యాయపరంగా అన్ని దారులు మూసుకుపోవడంతో, పదవి నుంచి తొలగింపు అవమానాన్ని తప్పించుకునేందుకు ఆయన శనివారం విధాన పరిషత్ ఛైర్మన్ బసవరాజ్ హొరట్టికి తన రాజీనామా లేఖను సమర్పించారు. వ్యక్తిగత కారణాలు, పార్టీ బాధ్యతలపై దృష్టి పెట్టేందుకే రాజీనామా చేస్తున్నట్లు ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ఈ తీర్పుతో, మిగిలిన ఒకటిన్నర సంవత్సరాల కాలానికి గాయత్రి శాంతేగౌడ ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

## శ్రీ బళ్ళారి రాఘవ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పశ్రీ



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 2 నంది పత్రిక** జిల్లా కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఆదివారం బళ్ళారి రాఘవ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు నాటక రంగ పితామహుడి గా గొప్ప రంగస్థలం నటుడిగా పేరుగాంచిన బళ్లారి రాఘవ నాటక రంగ అభివృద్ధికి చేసిన విశిష్ట కృషి చి రస్మరణీయమని అన్నారు. బళ్ళారి రాఘవ అసాధారణ నటనా ప్రతిభతో పాటు సాంఘిక చైతన్యాన్ని పెంపొందించే నాటకాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారని పేర్కొన్నారు. కళను సమాజ సేవకు సాధనంగా మలిచిన మహనీయుల్లో బళ్ళారి రాఘవ ఒకరని కొనియాడారు. నేటి యువత బళ్ళారి రాఘవ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని కళల పట్ల ఆసక్తి పెంపొందించుకోవడంతో పాటు సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పి. ప్రభాకర్ ,జిల్లా టూరిజం శాఖ అధికారి ఏ .వెంకట అప్పారావు, డీఈవో ఈ నారాయణ, కలెక్టరేట్ ఏవో ఎన్. వెంకటేశ్వర్లు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పింగళి వెంకయ్య తెలుగువాడు కావడం గర్వకారణం -ఎంపీ పుట్టా మహేష్‌బి

**150వ జయంతి సందర్భంగా జంగారెడ్డిగూడెంలో 2 కి.మీ. భారీ త్రివర్ణ పతాక ర్యాలీ**



**విజయవాడ బ్యూరో చీఫ్ ఆగస్టు 2 నంది పత్రిక** భారత జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య తెలుగువాడు కావడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. పింగళి వెంకయ్య 150వ జయంతి సందర్భంగా సోమవారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన రెండు కిలోమీటర్ల భారీ జాతీయ పతాక ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ఎంపీ పుట్టా మాట్లాడుతూ : స్వాతంత్ర్య సమరంలో మహాత్మా గాంధీతో కలిసి పోరాడిన పింగళి వెంకయ్య దేశానికి త్రివర్ణ పతాకాన్ని అందించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ పాఠశాల విద్యార్థులతో కలిసి ఫోటోలు దిగుతూ వారితో ఆత్మీయంగా ముచ్చటించారు.

# వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్..

**ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**టీడీపీ కార్యకర్త ఇంటిపై దాడి చేశారన్న ఆరోపణలు**

**ఎమ్మెల్యేతో పాటు మరో 14 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు**

**ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట నిందితుల హాజరు**

**అక్రమ అరెస్ట్ అంటూ వైసీపీ ఆరోపణ.. ఖండించిన ప్రభుత్వం**

కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. టీడీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై అధికార వైసీపీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే బి. విరూపాక్షిని, ఆయన కుమారుడు చంద్రశేఖర్‌ను పోలీసులు శనివారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు మరో 13 మందిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారందరినీ ఆదివారం ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట హాజరుపరిచారు.

**అసలేం జరిగింది?** చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో శనివారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాడులు, దౌర్జన్యాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. టీడీపీ కార్యకర్త శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే విరూపాక్షితో సహా మొత్తం 15 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**పోలీసుల కథనం ప్రకారం..** వైసీపీ నేత గిరి, టీడీపీ నేతలైన గురునాథ్, శివ, నాగరాజు మధ్య మొదలైన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. గిరి ఫోన్ చేయడంతో ఎమ్మెల్యే విరూపాక్షి సుమారు 10 కార్ల కాన్వాయ్‌తో గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలోనే ఆయన అనుచరులు టీడీపీ నేత నాగరాజు ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన మహిళ సుచిత్రపై కూడా చేయి చేసుకున్నారని, మరో నేత కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు. దళిత వ్యక్తి ఇంటిపై దాడి చేసి, ఆయన భార్యపై చేయి చేసుకున్న ఘటన కావడంతోనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వివరించారు.

**అక్రమ అరెస్ట్ అంటున్న వైసీపీ** అయితే, ఈ అరెస్టును వైసీపీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇది కక్షపూరితమైన, అక్రమ అరెస్ట్ అని ఆరోపించారు. తమ పార్టీ నేత గిరి ఇంటిపై టీడీపీ నాయకులే మొదట దాడికి ప్రయత్నించగా, ఎమ్మెల్యే విరూపాక్షి అక్కడికి విచారణకు వెళ్లారని తెలిపారు. ఆ సమయంలో టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వడంతో ఎమ్మెల్యే సోదరుడు శ్రీరామకు గాయాలయ్యాయని చెప్పారు. తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు, అర్ధరాత్రి ఎమ్మెల్యేను, ఆయన కుమారుడిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఇంటిలోని సీసీటీవీ హార్డ్ డిస్క్‌లను కూడా పోలీసులు తీసుకెళ్లారని వారు పేర్కొన్నారు.

**ఫ్యాక్ట్ చెక్ తో బదులిచ్చిన ఏపీ ప్రభుత్వం** ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అక్రమ అరెస్టు అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యం అని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేసింది. "ఎస్సీ వర్గానికి చెందిన ఒక వ్యక్తి ఇంటిపై దాడి చేసి అతని భార్య పై దౌర్జన్యం చేసి ఆమె వస్త్రాలు చించిన కేసులో ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. వాస్తవం ఏమిటంటే.. ఆలూరు నియోజకవర్గం, చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో ఒక పార్టీ నాయకుడు గిరి (యాదవ్), మరొక పార్టీ నాయకులైన గురునాథ్ (యాదవ్), శివ, నాగరాజు (ఎస్సీ మాదిగ) లను అసభ్య పదజాలంతో మాట్లాడారు. ఎందుకు అలా మాట్లాడావని నాగరాజు ప్రశ్నించినందుకు గిరి ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేయగా, ఆయన తన అనుచరులతో కలిసి సుమారు 10 కార్లలో అక్కడకు చేరుకున్నారు. వారు నాగరాజు ఇంటిలోకి దౌర్జన్యంగా చొరబడి, ఎమ్మెల్యే సమక్షంలోనే ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ఈ దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన నాగరాజు భార్య సుచిత్రపై చేయిచేసుకుని ఆమె నైటీని చింపేశారు. అలాగే వారిని వారించబోయిన రాజశేఖర్, నాగరాజు అన్నపై కూడా విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ విషయం తెలుసుకుని పరామర్శించడానికి వచ్చిన స్థానిక నాయకుడు కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారు. ఈ ఘటనలో గాయపడిన బాధితులను చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. జరిగింది ఇది కాగా అక్రమంగా పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రచారం చేయడం సబబు కాదు" అని ఏపీ ఫ్యాక్ట్ చెక్ వివరించింది. కాగా, ఈ అరెస్టులతో ఆలూరు నియోజకవర్గంలో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ మధ్య రాజకీయ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

## పొగాకు సాగు తగ్గించి ఆయిల్ పామ్ వైపు మళ్లండి బిరైతులకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి

**ధరల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రయత్నాలు**

**కొల్లేరు సమస్యకూ త్వరలో పరిష్కారం**

**ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్**



**విజయవాడ బ్యూరో చీఫ్ ఆగస్టు 2 నంది పత్రిక** పొగాకు రైతులు క్రమంగా ఆయిల్ పామ్ సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. జంగారెడ్డిగూడెంలో మల్టీపర్పస్ హాల్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ మీడియాతో మాట్లాడుతూ : అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధ ప్రభావంతో పొగాకు ఎగుమతులు మందగించి ధరలు తగ్గాయని, రైతుల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని, పొగాకు బోర్డు ద్వారా రైతులకు రూ.50 వేల వడ్డీలేని రుణం కల్పించేలా చర్యలు తీసుకున్నామని, ముఖ్యంగా లోగ్రేడ్ పొగాకు రైతులకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆయిల్ పామ్‌కు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుందని, రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. కొల్లేరు భూముల సమస్య కూడా తుది దశకు చేరుకుందని, రైతులకు అనుకూల పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం సీఎస్‌టీఎస్ కళాశాలలో ఎంపీ నిధులు రూ.4.90 లక్షలతో నిర్మించిన పార్కింగ్ షెడ్‌ను ప్రారంభించారు. విద్యార్థుల విజ్ఞప్తికి ఆరు నెలల్లోనే హామీని నిలబెట్టుకున్నట్లు తెలిపారు.



# ఏపీ ఆస్ట్రేలియా కొత్త అధ్యాయం

జూలియన్ హిల్‌ల సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. గతేడాది తాను ఆస్ట్రేలియాలో జరిపిన పర్యటన సందర్భంగా జరిగిన చర్చలకు ఇది కార్యాచరణ రూపమని మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా తెలిపారు. మంత్రి నారా లోకేశ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఒప్పందాలు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కుదిరాయి. ముఖ్యంగా క్లీన్ ఎనర్జీ, అత్యాధునిక తయారీ, సమ్మిళిత విద్య, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో ఈ భాగస్వామ్యం కీలకం కానుంది. ప్రతిభ, ఆవిష్కరణ, ఉమ్మడి శ్రేయస్సు పునాదులపై ఆంధ్రప్రదేశ్-ఆస్ట్రేలియా భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసేందుకు ఈ ఒప్పందాలు దోహదపడతాయని లోకేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా బృందం సీఎం చంద్రబాబుతోనూ సమావేశమైంది. సౌరశక్తి హబ్‌గా ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనలో భాగంగా, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆవిష్కరణల హబ్‌గా మార్చే దిశగా తొలి అడుగు పడింది. ఐఐటీ తిరుపతి, ఏపీ ప్రభుత్వానికి చెందిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (జశీజుజు), సిడ్నీకి చెందిన యూఎన్ఎస్ డబ్ల్యూ యూనివర్సిటీ సంయుక్తంగా ఏపీలో "సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటు చేయనున్నాయి. దీని ద్వారా అత్యాధునిక సోలార్ పీవీ తయారీ, రీసైక్లింగ్, పరిశ్రమ ఆధారిత పరిశోధన, ఫ్యాకల్టీ అభివృద్ధి, ప్రపంచస్థాయి నైపుణ్య శిక్షణపై దృష్టి సారిస్తారు.

**విద్య, మానసిక ఆరోగ్యానికి పెద్దపీట** "ప్రతి చిన్నారి నేర్చుకోవడానికి, ఎదగడానికి, రాణించడానికి అర్హులు" అనే ఉద్దేశంతో ఆటిజం, ఇతర న్యూరోడైవర్స్ అభ్యసన అవసరాలున్న విద్యార్థులకు సమ్మిళిత విద్యను బలోపేతం చేసేందుకు మరో ఒప్పందం కుదిరింది. యూఎన్ఎస్ డబ్ల్యూ సిడ్నీ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తాయి. ప్రత్యేక ఉపాధ్యాయులకు, సాధారణ టీచర్లకు ఆధునిక శిక్షణ అందించి, ఏపీ విద్యార్థుల అవసరాలకు తగిన వనరులను అభివృద్ధి చేస్తారు. అలాగే, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, శ్రేయస్సుకు ప్రాధాన్యతనిస్తూ, రౌండ్ డింపుల్ సంస్థ భాగస్వామ్యంతో ఎంపిక చేసిన ఉన్నత విద్యాసంస్థల్లో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. దీని ద్వారా విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా గోప్యంగా వెల్‌నెస్ అసెస్‌మెంట్‌లు, వర్చువల్ కౌన్సెలింగ్ సేవలను పొందవచ్చు.

**ప్రపంచస్థాయి ఉద్యోగాలకు యువత తయారీ** రాష్ట్ర యువతకు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఏపీఎస్ఎస్‌డీసీ, ఆస్ట్రేలియాకు చెందిన డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా వృత్తి విద్య, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, వృత్తిపరమైన ధ్రువపత్రాలు, అంతర్జాతీయ ఉపాధి మార్గాలను బలోపేతం చేస్తారు. ఈ చర్యల ద్వారా నేటి ఉద్యోగాలకే కాకుండా, రేపటి కెరీర్‌లకు సైతం ఏపీ యువతను సిద్ధం చేస్తున్నామని లోకేశ్ వివరించారు.

# అదనపు పన్నుల వాటా కేటాయింపు..

అవుతుంది. అయితే, ఈసారి గడువుకు ముందే ఏపీకి అదనంగా రూ.4,597 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ కేటాయింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "అదనపు పన్నుల వాటాను కేటాయించినందుకు ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ప్రజల తరఫున ధన్యవాదాలు. కేంద్రం విడుదల చేసిన ఈ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతుంది" అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అందిస్తున్న సహకారం ఎంతో కీలకమని చంద్రబాబు అన్నారు. ఈ సహకారం రాష్ట్ర పురోగతికి గొప్పగా దోహదపడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి అందిన ఈ అదనపు నిధులు, రాష్ట్రంలో చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులకు ఊతమిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఏపీలో తక్కువ ధరకే బియ్యం..

"ప్రజలకు కష్టం రాకముందే వారిని ఆదుకునే ప్రభుత్వం మాది. మార్కెట్‌లో బియ్యం ధరలను సమీక్షించి, సామాన్యుడిపై భారం పడకుండా తక్కువ ధరకే బియ్యం అందించాలని నిర్ణయించాం. మా విజ్ఞప్తికి రైస్ మిల్లర్లు సానుకూలంగా స్పందించి సహకరించడం అభినందనీయం" అని తెలిపారు. భవిష్యత్తులో కందిపప్పు, పామాయిల్‌ను కూడా తక్కువ ధరలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన రావు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ నూపుర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జనసేన నేత అమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?

చిప్పగిరి మండలం నేమకల్లులో టీడీపీ శ్రేణులు తమ పార్టీ నాయకుడి ఇంటిపై దాడి చేయగా, ప్రాణభయంతో ఆ కార్యకర్త ఎమ్మెల్యేకు ఫోన్ చేశాడని జగన్ వివరించారు. బాధితుడికి అండగా నిలబడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపైనే టీడీపీ వారు రాళ్లతో దాడి చేశారని, ఈ ఘటనలో ఆయన సోదరుడు గాయపడ్డాడని తెలిపారు. వాస్తవానికి దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాల్సింది పోయి, బాధితుడైన ఎమ్మెల్యేపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయడం దారుణమని అన్నారు. అర్ధరాత్రి పోలీసులు జరిపిన దౌర్జన్యం బయటకు రాకూడదనే భయంతోనే ఎమ్మెల్యే ఇంట్లోని సీసీటీవీ హార్డ్‌డిస్క్‌లను తీసుకెళ్లారని, సాక్ష్యాలను కాపాడాల్సిన పోలీసులతోనే సాక్ష్యాలను మాయం చేయిస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదే తరహా రాజకీయ కక్ష సాధింపు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోందని జగన్ విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే షేక్ మహ్మద్ ముస్తఫా, ఆయన కుమారుడిపై కూడా వ్యాపార వివాదాన్ని అడ్డుపెట్టుకుని కిడ్నాప్ కేసు బనాయించారని, పోలీసులకు అప్పగించిన వ్యక్తిని కిడ్నాప్ చేశారని కేసు పెట్టడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ అక్రమ అరెస్టులు, దాడులకు పాల్పడుతున్నారని జగన్ అన్నారు. డీఎస్సీ-2025 అక్రమాలపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఎందుకు రాజీనామా చేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.9,500 కోట్ల విద్యా, వసతి దీవెన బకాయిలు, నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.3 వేల భృతి హామీ ఏమైందని నిలదీశారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందన్నారు. "అధికారం, పోలీసు బలం శాశ్వతం కాదు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అర్ధరాత్రి అరెస్టులు చేసినా వైసీపీ వెనక్కి తగ్గదు. బాధితులకు అండగా నిలుస్తూ అరాచక పాలనపై పోరాటం కొనసాగిస్తాం" అని జగన్ స్పష్టం చేశారు.

## ఇంటింటికీ టీడీపీ: ఏడు రోజుల్లో 17.61 లక్షల ఇళ్లకు.. ప్రభుత్వంపై విశ్వాసానికి నిదర్శనమన్న లోకేశ్

ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ టీడీపీ 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధిసంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. ఏడో రోజైన ఆదివారం కూడా ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఏడు రోజుల్లో కూటమి శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17,61,197 ఇళ్లను సందర్శించి, ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏ మాత్రం విరామం తీసుకోకుండా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడో రోజు ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3,01,197 ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా, గత రెండేళ్లలో ప్రభుత్వం రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారదర్శక పాలన వంటి రంగాల్లో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను గణాంకాలతో సహా తెలియజేశారు. ఈ కార్యక్రమ పురోగతిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. సెలవు రోజు కూడా కష్టపడి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. మరోవైపు, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఈ కార్యక్రమాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా కార్యక్రమ పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన సూచనలు చేస్తున్నారు. ఆదివారం కూడా విశేష ఉత్సాహంతో పాల్గొనడం, ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన చూస్తుంటే ప్రభుత్వంపై ఉన్న విశ్వాసం స్పష్టమవుతోందని లోకేశ్ అన్నారు. ఇదే ఉత్సాహంతో ప్రతి ఇంటికీ చేరుకుని ప్రభుత్వ పనితీరును వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఈ కార్యక్రమం నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# రూ. 4.38 కోట్ల అంచనా వ్యయంతో నంద్యాల




## – పులిమద్ది రోడ్డు పనులకు భూమిపూజ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 2 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లా పరిధిలోని రహదారుల అనుసంధానతను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని . ఇందులో భాగంగా నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా విచ్చేసి రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల నుండి ఎన్ఎన్ రోడ్డును (పులిమద్ది మీదుగా) కలుపుతూ కిలోమీటరు 1/300 నుండి 11/2 వరకు రహదారి ఉపరితల అభివృద్ధి (ఇంప్రూవ్మెంట్స్ టూ రైడింగ్ సూరపేస్) పనుల కోసం రూ. 4.38 కోట్లు (438.00 లక్షలు) మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఎండిఆర్ ప్లాన్ స్కీమ్ కింద ఈ నిధులను కేటాయించి, అత్యున్నత ప్రమాణాలతో ఈ రహదారిని నిర్మించనున్నట్లు తెలిపారు . ఈ ప్రాంత ప్రజలు, రైతులు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ప్రయాణ ఇబ్బందులను శాశ్వతంగా తొలగించడమే ధ్యేయంగా ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు మంత్రి ఫరూక్ అన్నారు . నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి లోపాలు లేకుండా, నిర్దేశిత గడువు లోపల పనులను పూర్తి చేయాలని రహదారులు మరియు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి మౌలిక వసతుల కల్పన ఎంతో అవసరమని, రాబోయే రోజుల్లో నంద్యాల నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎమ్మార్వోలు శ్రీనివాసులు , శ్రీవాణి , నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, జిల్లా పార్టీ సెక్రటరీ రాజేష్ (బుజ్జి), నంద్యాల మండలం టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి , చంద్రారెడ్డి, కళ్యాణ్, వెంకటేశ్వర్ రెడ్డి , ప్రదీప్ కుమార్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులు మరియు పులిమద్ది గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## భోగాపురం క్రెడిట్ చోరీ.. జగన్‌పై విమర్శలు తగవు: రెడ్యం వెంకటసుబ్బారెడ్డి



**ఖాజీపేట నంది పత్రిక ప్రతినిధి జూలై 02** ఖాజీపేట: భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణంలో గత ప్రభుత్వ కృషిని విస్మరించి క్రెడిట్ చోరీకి పాల్పడటమే కాకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. ఆదివారం దుంపలగట్టులోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ, వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో భూముల సేకరణ, నిర్వాసితుల పునరావాసం, అనుమతుల సాధన, న్యాయపరమైన అడ్డంకుల తొలగింపుతో పాటు ఎయిర్‌పోర్టు పనుల్లో సుమారు 80 శాతం పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులు పూర్తి చేసిన కూటమి ప్రభుత్వం మొత్తం ప్రాజెక్టుకు తామే కారణమని చెప్పడం సరికాదన్నారు. ప్రారంభోత్సవ సభలో చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని, ఎయిర్‌పోర్టు అంశాలను వక్రీకరిస్తూ వైఎస్ జగన్‌పై విమర్శలు చేయడం రాజకీయ దురుద్దేశమేనని మండిపడ్డారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు అనుసంధానంగా ఉండే బీచ్ రోడ్డు విస్తరణ వంటి పనులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అలాగే, ప్రధాని నరేంద్ర మోదీ వైఎస్ జగన్‌పై ఎలాంటి విమర్శలు చేయకపోవడం ఆయన విశ్వసనీయతకు నిదర్శనమని పేర్కొన్నారు.

## వానమ్మ వానమ్మ, ఒక్కసారి వచ్చిపోవమ్మా...

### వర్షం కోసం ప్రత్యేక పూజలు...




**సిద్ధవటం మండలం, నందిని ప్రతినిధి, ఆగస్టు 2 కడప వైఎస్ఆర్ జిల్లా..** వర్ష భావంతో వాగులు వంకలు చెరువులు ఎండి భూగర్భ జలాలు అడుగంటాయి. వాన కురవకపోవడంతో వరుణ్ ఎక్కి కరుణ కోసం ఆదివారం రేణుక ఎల్లమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధగుటం మండలంలో మాచుపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ జగజ్జనని రేణుక అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించి వర్షాలు కురవాలని వరుడికి కరుణ కోసం వానమ్మ వానమ్మ ఒక్కసారి వచ్చిపోను అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు సుబ్బరాజు మాట్లాడుతూ అమ్మవారికి జలాభిషేకం పంచాంగత అభిషేకాలు విశేష పూజలు నిర్వహించామని కలువాయి వెంకటగిరి ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున చేరుకొని వరుణ దేవుని కటాక్షం కోసం కుదరవచ్చారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు

# పెసరవాయి గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్ లో భాగంగా ప్రత్యేక తనిఖీలు





## సరైన ధ్రువపత్రాలు లేని 12 పత్రాలు లేని మోటార్ సైకిళ్లు స్వాధీనం....

**నంది పత్రిక గడివేముల** నంద్యాల జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీస్ గారి ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏ.ఎస్.పి సుస్మిత ఐపీస్.గారి సూచనలతో గడివేముల పోలీస్ స్టేషన్ సబ్ఇన్‌స్పెక్టర్ సీసీ.నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి గడివేముల మండలం పెసరవాయి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున కార్బన్ అండ్ సెర్చ్ లో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి, సరైన పత్రాలు మరియు నంబర్ ప్లేట్లు లేని 12 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు అనుమానితుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులను పరిశీలించి వారి కదలికలపై నిఘా పెట్టారు. అనంతరం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించి మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణ, ఆస్తి నేరాల నివారణ, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, బాల్య వివాహాల నిర్మూలన, ఆన్‌లైన్ మోసాలు, అనుమానాస్పద లింకులు మరియు సందేశాల పట్ల అప్రమత్తత, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, ఫ్యాక్షన్ మరియు రాజకీయ వివాదాలకు దూరంగా ఉండాల్సిన అవసరం, శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్తులు చట్టాలను గౌరవిస్తూ ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేందుకు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

## ఆదమరిస్తే కింద పడాల్సిందే.. మలుపు వద్ద జర జాగ్రత్త...



**సిద్ధవటం మండలం, నంది ప్రతినిధి, ఆగస్టు 2, వైయస్సార్ కడప జిల్లా.** బండి కనుమ వద్ద ఉన్న ప్రధాన మలుపు వద్ద ప్రయాణికులు ఆదమరిస్తే కింద పడాల్సిందే, మలుపు వద్ద జర జాగ్రత్తగా వహించి వాహనాలు నెమ్మదిగా వెళ్లాలని పలువురు తెలిపారు మండలంలోని మాచుపల్లి, కడప రహదారి, బండి కనుమలకు క్రాస్ వద్ద తారు రోడ్డు దెబ్బతిని గుంతలమయం కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారి భ్రమతో చేసి ప్రమాదాలు అరికట్టాలని పలు వాహనదారులు తెలిపారు. ఈ రకదారిన అతి తక్కువ కిలోమీటర్లు వ్యవధితో జిల్లా కేంద్ర కడపకు వెళ్ళవచ్చని దూరప్రాంతం నుండి వాహనాలు ఇదే రహదారిన వెళతాయని ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువులు తెలిపారు.

## బలపాలపల్లె గ్రామంలో ‘ఇంటింటికి తెలుగుదేశం.



**బేతంచెర్ల ఆగస్టు 02 ( నంది పత్రిక ).** తెలుగుదేశం పార్టీ చేపట్టిన “2 ఏళ్ల నమ్మకంసంక్షేమం, అభివృద్ధి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ఆదివారం రోజు బేతంచెర్ల మండలంలోని బలపాలపల్లె గ్రామంలో ప్రజల మధ్య సాగింది. ఈ కార్యక్రమంలోతెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పోలూరు శ్రీనివాసరెడ్డి ఇంటింటికి వెళ్లి, ప్రజల సమస్యలు, ప్రజల అవసరాలను తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. డోర్ టు డోర్ కార్యక్రమం లో 227 బూత్ కన్వీనర్ రాచపోగుల ఈశ్వరయ్య,తెలుగుదేశం పార్టీ నాయకులు పిక్కిలి మధుశేఖర్,ముద్దవరం శేఖర్,రాసిపోగుల శివన్న తదితరులు పాల్గొన్నారు.



## ఇస్రాత్ కి రోటరీ క్లబ్ లో ఘన సన్మానం

**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 02 . (నంది పత్రిక ):**ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం స్టేట్ మూడో ర్యాంకు సాధించినటువంటి షేక్ ఇస్రాత్ కి రోటరీ క్లబ్ లో ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సుధా ప్రసాద్ రెడ్డి సెక్రటరీ లక్ష్మీకాంత్ రెడ్డి పి డిజిల్ కల్లూరు రామలింగారెడ్డి శ్రీరామ్మూర్తి సుబ్బరామయ్య రామచంద్రయ్య కండి హరినాథ్ అరవింద ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.



## చిన్నదేవలాపురం లో పేలుడు

### ప్రాణాపాయ స్థితి నుండి బయటపడ్డ వృద్ధ దంపతులు గ్యాస్ లీకే కారణం



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 2 :** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న చిన్నదేవులాపురం గ్రామంలో ఆదివారం భారీ పేలుడు సంభవించడంతో ఆ గ్రామ ప్రజలు భయాందోళనకు గురైన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి కారణంగా ఊరంతా ఉలికిపాటుకు గురైంది. చిన్న దేవలాపురం గ్రామానికి చెందిన పుట్టుపల్లి సుబ్బరాయుడు (64) భార్య పుట్టుపల్లి నాగమ్మ (56) తో కలిసి ఆదివారం ఉదయం ఉపాధి పనులకు వెళ్లడం జరిగింది. పనులు ముగించుకొని దంపతులిరువురు ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంట్లో ఉన్న హెచ్పీ గ్యాస్ సిలిండర్ లీక్ అవుతూ ఉండడంతో గ్యాస్ అంతా ఇంట్లో ఆవహించింది. ఇది గమనించని నాగమ్మ గ్యాస్ స్టవ్ ను అంటించే ప్రయత్నం చేయడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీనితో పుట్టుపల్లి సుబ్బరాయుడు కు కాళ్లకు బలంగా గాయాలయ్యాయి. భార్య నాగమ్మ తలకు చేతులకు పాక్షి కంగా గాయాలయ్యాయి. దురదృష్టవశాత్తు సిలిండర్ పేలిపోయి ఉంటే, పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగి ఉండేది. సిలిండర్ పే లకపోవడంతో, స్వల్ప గాయాలతో వృద్ధ దంపతులు బయటపడగలిగారు. పేలుడు కారణంగా ఇంటి వాకిలి కూడా ధ్వంసం అయింది. ఈ సంఘటన తెలిసి వెంటనే చుట్టుపక్కల ఉన్న ప్రజలు వారిని సురక్షితంగా బయటకు తెచ్చి చికిత్సలు చేశారు. చికిత్సల నిమిత్తం దంపతులు ఇరువురిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

**సిలిండర్ లీకు కావడం వల్లే ప్రమాదం** : చిన్నదేవలాపురంలో సిలిండర్ లీకు కావడం వల్లే ఇరువురు దంపతులు ప్రమాదానికి గురికావాల్సి వచ్చిందని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో తరచూ లీకుల సిలిండర్లు వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. సిలిండర్ ను నింపే సమయంలో వాచర్ ను మార్చాల్సి ఉన్న, కంపెనీ నిర్వాహకులు ఈ విషయంలో జాగ్రత్తలు వహించడం లేదని పేర్కొంటున్నారు. గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్లు సరఫరా చేసే సమయంలో, వినియోగదారులకు సిలిండర్లను దించిపోతున్నారు. సిలిండర్లు అన్లోడ్ చేసిన తర్వాత వినియోగదారుడు ఇంటికి వెళ్లి బిగించాల్సి ఉంది. సిలిండర్ ను బిగించిన తర్వాత గ్యాస్ లీక్ అవుతుందా లేదా అన్న విషయాలను కూడా డెలివరీ బాయ్ పరిశీలించిన పరిశీలించాల్సి ఉంది. అయితే ఈ నిబంధనలను ఎక్కడా కూడా పాటించడం లేదు.తర్వాత మహిళలు సిలిండర్ ను ఏర్పాటు చేసుకునే సమయంలో గ్యాస్ వాసనలు వస్తూ ఉండటంతో, ఈ విషయంపై చాలా గ్రామాలలో మహిళలు ఆందోళన చెందుతున్నారు. గ్యాస్ సిలిండర్ పై అవగాహన ఉన్న కొందరు వ్యక్తులతో మహిళలు మరమ్మత్తులు చేయించుకుంటున్నారు. గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే సమయంలో నిర్వాహకులను వాచర్లు అడిగినప్పటికీ లేవని చేతులెత్తేస్తున్నారు. ఐదు రూపాయల విలువచేసే వాచర్లను కూడా నిర్వాహకులు ఇవ్వడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





## నంద్యాల అంజుమన్ ఆధ్వర్యంలో.

### పదవతరగతిలో ఉత్తీర్ణత సాధించిన 530 మంది ముస్లీం విద్యార్థులకు ... ఒక్కొక్కరికి రూ 3000/- చోప్పున రు.16,90,0000 నగదు చెక్కులు పంపిణీ




**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 2 ( నంది పత్రిక )** పద్దెనిమిది సంవత్సరాలుగా పంపిణి చేస్తున్నట్లుగానే ఈ సంవత్సరం పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ముస్లీం విద్యార్థిని విద్యార్థులకు ఒక్కొక్కరికి రు.3000/- చొప్పున 530 మంది విద్యార్థులకు రూ. 16,90,000/- పంపిణి చేసారు. ఆదివారం స్థానిక అంజుమన్ షాది ఖానాలో అంజుమన్ సంస్థ అధ్యక్షులు హాజి నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగదు చెక్కులు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో ఇమాముల సంఘం అధ్యక్షులు హాఫీజ్ అమ్జద్ బాషా సిద్దీఖ్, జమాతె ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షులు అబ్దుల్ సమద్, అంజుమన్ ఉపాధ్యక్షులు అబ్దుల్ హఖ్, కార్యదర్శి వరంగల్ గౌస్, సభ్యులు హిదాయత్ ఖాన్, జీ. యం. మొహిద్దీన్, హుసేన్ బాషా (మున్నా), ఉపాధ్యాయులు ప్రసాద్ విద్యార్థుల తల్లితండ్రులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ ఖుద్దూస్ మాట్లాడుతూ అంజుమన్ ఆధ్వర్యంలో సేవలు వివరిస్తు ప్రతి సంవత్సరం విద్యార్థులకు స్కాలర్షిప్స్, పేద ముస్లిం వనితల సామూహిక వివాహాలు నిర్వహించి ప్రతి జంటకు 50,000/- నగదు, నిఖా ఖర్చులు భరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం రమజాన్ నెలలో వుంది మస్జిద్ లకు రెండేసి చొప్పున జానిమాజ్లు పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. పేదవారికి అంజుమన్ తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని ప్రకటించారు. ఈ సమావేశంలో సమద్, అమ్జద్ మాట్లాడుతూ అంజుమన్ సేవలు నంద్యాల ముస్లింలకు తలమానికం అని, ఫుర్ఖాన్ ఖబరస్థాన్ అభివృద్ధికి కోటి రూపాయలు అంజుమన్ తరుపున ఇవ్వనున్నట్లు ఖుద్దూస్ ప్రకటించారని మెడికల్ లో ప్రభుత్వ సీటు సాధించిన పేద అమ్మాయిలకు ఐదు సంవత్సరాల ప్రభుత్వ ఫీజు చెల్లించటానికి అంజుమన్ సిద్ధంగా ఉందని తెలిపారు. పేద మహిళలు దుబారా ఖర్చులకు పోకుండా అంజుమన్ ఆధ్వర్యంలో వివాహితులు ముందుకు రావాలని ముస్లిం సమాజాన్ని కోరారు.



# లయన్స్ సేవా సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ రవి కృష్ణ



### గుత్తిలో జరిగిన లయన్స్ జిల్లా 316 జె 9వ జిల్లా క్యాబినెట్ సదస్సులో. ప్రమాణ స్వీకారం చేయించిన మాజీ అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ డైరెక్టర్ మదన్ మోహన్

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 2 ( నంది పత్రిక )** లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ లో నంద్యాల, కర్నూలు, కడప, అన్నమయ్య, తిరుపతి అనంతపురం, సత్యసాయి, నెల్లూరు జిల్లాల లయన్స్ క్లబ్ లో తో కూడిన లయన్స్ జిల్లా 316 జె లయన్స్ జిల్లా గవర్నర్ విరూపాక్ష రెడ్డి అధ్యక్షతన ఆదివారం గుత్తిలో జరిగిన నూతన క్యాబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమం లో నంద్యాల కు చెందిన డాక్టర్ రవి కృష్ణ తో రెండవ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ మాజీ అంతర్జాతీయ డైరెక్టర్ మదన్ మోహన్ పదవి ప్రమాణ స్వీకారం చేయించారు. గూడూరు కు చెందిన వెంకటేశ్వరరావు ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా, గ్లోబల్ యాక్షన్ టీం చైర్మన్ లు గా రవి ప్రకాష్, సుధాకర్ రెడ్డి నంద్యాల కు చెందిన నిజాముద్దీన్, సూళ్లూరుపేటకు చెందిన డాక్టర్ ఆదిశేషారెడ్డి, రీజియన్ చైర్మన్ లు గా, నంద్యాలకు చెందిన సోమేశుల నాగరాజు తో పాటు 17 మంది జోన్ చైర్మన్ లు పదవి ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రానున్న మూడు సంవత్సరాల లో లయన్స్ సేవా సంస్థ ద్వారా డిస్ట్రిక్ట్ 316 జె లో ఉన్న 50 కి పైగా క్లబ్బులలో, ఆయా క్లబ్బుల సభ్యుల సహకారంతో, గవర్నర్ విరూపాక్ష రెడ్డి, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకటేశ్వరరావు లతో కలిసి సేవా కార్యక్రమాలను ముమ్మరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి లయన్స్ సీనియర్ నాయకులు అంబటి సుధాకర్ రెడ్డి, మూల్పూరు ఉపేంద్ర, ఆంధ్రప్రదేశ్ లయన్స్ సమాఖ్య మాజీ చైర్మన్ ఏ వి ఆర్ ప్రసాద్, డాక్టర్ గోపాలరావు, అనిల్ జైన్, పాపారావు, వేణుబాబు, గద్దె శేషగిరి,మాజీ లయన్స్ జిల్లా గవర్నర్లు నాగేశ్వరరావు, మాణిక్య ప్రభు,డి ఎస్ కుమార్, చిన్నపరెడ్డి, కిషోర్,రమేష్ నాద్ రెడ్డి, రామ చంద్ర ప్రకాష్, గౌతమ్, గోపాలకృష్ణ, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్, సీనియర్ సభ్యులు శ్రీకాంత్, రవి ప్రకాష్, సుధాకర్ రెడ్డి, నిజాముద్దీన్, సోమేశుల నాగరాజు,బైసాని రమేష్, మహేశ్వర్ రెడ్డి, చంద్రమోహన్, కసెట్టి చంద్రశేఖర్,ఇమ్మడి రామకృష్ణుడు, కన్నయ్య,జనార్ధన్, సురేష్,ఆంధ్ర ప్రదేశ్ లో ఉన్న 5 లయన్స్ జిల్లాల గవర్నర్లు,వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు, గ్రేటర్ రాయలసీమ లో ఉన్న 8 జిల్లాల పరిధిలోని లయన్స్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నేతాజీ భవన నిర్మాణ సంఘం సమావేశం

### లేబర్ కార్డు ఉంటే ప్రయోజనాలు



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 2 :** కార్మికులు లేబర్ కార్డు ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం ద్వారా అనేక ప్రయోజనాలను పొందవచ్చునని నేతాజీ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ పేర్కొంది. ఆదివారం బండి ఆత్మకూరులో కమిటీ భావన నిర్మాణ కార్మికుడు రిజ్వాన్ అధ్యక్షతన ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి బియ్య గారి చాంద్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు అనేక ప్రయోజనాలను కల్పిస్తుందని అన్నారు. కార్మికులకు వివిధ రుణాలను మంజూరు చేయించడమే కాకుండా సంఘంలో లేబర్ కార్డు కలిగిన వారికి ఈ శ్రమ కార్డు కలిగిన వారికి వారి కుటుంబంలోని మహిళలు లబ్ధి పొందవచ్చు అని అన్నారు. కార్మిక కుటుంబాలలోని మహిళలు మొదటి రెండు కాన్పుల వరకు 20వేల రూపాయలను పొందే అవకాశం ఉంటుందని అన్నారు. కుటుంబంలో ఆడపిల్లలకు వివాహాల సందర్భంగా 20వేల రూపాయలను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కమిటీ ఏర్పడిన తర్వాత మండలంలో మూడు కుటుంబాల వారికి కాన్పుల సందర్భంగా 20వేల రూపాయలు వారి బ్యాంకు అకౌంట్లో జమ చేయడం జరిగిందని అన్నారు. భావన నిర్మాణ కార్మికులందరూ లేబర్ కార్డులను కలిగి ఉండాలని కమిటీ విద్యార్థి చేసింది. లేబర్ కార్డు లేని వారు కూడా కార్డులనిపించేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు జోరుద్దీన్, రిజ్వాన్, తిరుపతి, కార్పెంటర్ మాలి,పాలిష్ కట్టర్ ఖాదర్,దర్గా గణపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రచార జాత



**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 02 . (నంది పత్రిక ):**నంద్యాల సిపిఐ కార్యాలయంలో సిపిఐ పట్టణ శాఖ కార్యదర్శుల కౌన్సిల్ సభ్యుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశమునకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై ఈనెల ఆరో తారీకు నుండి 15వ తారీఖు వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రచార జాత నిర్వహించాలని వివరించడం జరిగింది.అనంతరం 17న జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ సహాయ కార్యదర్శులు లక్ష్మీదేవి భూమని శ్రీనివాసులు ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి శ్రీనివాసులు ఏ ధనుంజయ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజిత మహిళా సమైక్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ తో పాటు శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.



## అడవి బిడ్డలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన అటవీ శాఖ



**శిరివెళ్ల (నంది పత్రిక) :,** నంద్యాల జిల్లా: అటవీ శాఖ ఆధ్వర్యంలో పచ్చర్ల గ్రామంలోని సీబీఈటీ ప్రాంగణంలో చెంచు గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్, డా. చైతన్య కుమార్ రెడ్డి, ఐఎఫ్ఎస్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని సందర్శించి ప్రారంభించారు. చెంచు గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో భాగంగా ఈ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని అన్నారు.నల్లమల అటవీ పరిధిలోని పచ్చళ్ళ గ్రామంలో నివసిస్తున్నటువంటి అడవి బిడ్డల ఆరోగ్యం మరియు సంక్షేమన్ని దృష్టిలో పెట్టుకొని సేవా కార్యక్రమాలతో పాటు వైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో చెలమ అటవీ రేంజ్ అధికారి నాగభూషణం, డీఆర్ఓ నాగేశ్వరరావు, డా. సాయి కుమార్ పాల్గొన్నారు. వైద్య బృందం చెంచు గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించింది ఈ ఉచిత వైద్య శిబిరంలో పచ్చర్ల గ్రామం మరియు పరిసర ప్రాంతాలకు చెందిన పేద గిరిజన చెంచు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు అటవీ శాఖకు మరియు వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చెంచు గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కోసం ఆరోగ్య భద్రతను పెంపొందించడం కోసం భవిష్యత్తులో కూడా ఇటువంటి ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న రామకృష్ణకు రూ.50 వేల ఆర్థిక సాయం

### కలచట్ల నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన బలిజ సంఘం

### పిల్లల చదువుకు, భవిష్యత్తుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ



**నందిపత్రిక –ప్యాపిలి** ప్యాపిలి మండల పరిధిలోని కలచట్ల గ్రామానికి చెందిన అరికెచర్ల రామకృష్ణకు ప్యాపిలి మండల బలిజ సంఘం నాయకులు, సభ్యులు ఆదివారం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఇటీవల కాలంలో రామకృష్ణ తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో, ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం బలిజ సంఘీయులు తమ వంతు బాధ్యతగా ఈ సహాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ... అనారోగ్యంతో బాధపడుతున్న రామకృష్ణ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఆ కుటుంబానికి అవసరమైన సూచనలు ఇస్తూ, వారి పిల్లల చదువులకు భవిష్యత్తుకు తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం అందించిన బలిజ సంఘ సభ్యులకు గ్రామస్థులు, స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యాపిలి పట్టణ బలిజ సంఘ నాయకులు, ప్రతినిధులు స్థానికులు పాల్గొన్నారు.

## కాటసాని నాగార్జున రెడ్డి కి ఘన నివాళి



**బనగానపల్లె ఆగష్టు 2నందిపత్రిక** మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి పెద్ద కుమారుడు స్వర్గీయ కాటసాని నాగార్జున రెడ్డి జయంతి సందర్భంగా ఆయన తల్లిదండ్రులు కాటసాని రామిరెడ్డి, జయమ్మ ఆదివారం బనగానపల్లె లోని నాగార్జున రెడ్డి ఘాట్ వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి కేక్ కట్ చేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## నేడు సోమవారం కర్నూలు నగరపాలకలో ‘ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ‘

### కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం ‘ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు.ప్రతి ఫిర్యాదు స్వీకరించబడిన వెంటనే సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు స్వయంగా ప్త్రజూం://వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్సైట్ ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ వివరించారు.

## 23,500 బాధితునికి అప్పగించి మానవత్వం చాటుకున్న108 సిబ్బంది



**నందిపత్రిక –ప్యాపిలి** జాతీయ రహదారి-44 పై ఆదివారం ఉదయం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను రక్షించడమే కాకుండా, వాహనంలో ఉన్న నగదును సురక్షితంగా బాధితుని కుటుంబ సభ్యులకు అప్పగించి 108 అంబులెన్స్ సిబ్బంది తమ నిజాయితీని, మానవత్వాన్ని చాటుకున్నారు. పోతుదొడ్డి సమీపంలో ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఐచర్ వాహనం, ట్రాక్టర్ పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఐచర్ డ్రైవర్ వీరేష్ నూతిమడుగు గ్రామం, కమ్మదూరు మండలం, అనంతపురం జిల్లా క్యాబిన్‌లో చిక్కుకుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. అతని కాలు విరగడంతో పాటు శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను సురక్షితంగా వెలికితీసి, గోల్డెన్ అవర్‌లో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుత్తి ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కి తరలించారు. ప్రమాదానికి గురైన లారీ డ్యాష్‌బోర్డులో ఉన్న రూ. 23,500 నగదును 108 సిబ్బంది భద్రపరిచి, బాధితుడి సోదరుడికి సురక్షితంగా అప్పగించారు. విపత్తు సమయంలో ప్రాణాలు కాపాడటంతో పాటు నగదును తిరిగి అప్పగించిన 108 సిబ్బంది నిజాయితీని, సమయస్ఫూర్తిని స్థానికులు, ప్రయాణికులు విశేషంగా అభినందించారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 2 నంది పత్రిక** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ. సి) శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆగస్ట్ 03 వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలియజేశారు.

## గోశాల నిర్మాణానికి విరాళం



**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 02 . (నంది పత్రిక ):**శ్రీ కాళికాంబ గోశాల రామ్నాథ్ రెడ్డి నగర్ లో ఉండే గోశాల నిర్మాణానికి శ్రీ నిచ్చెన మెట్ల సుబ్బరామయ్య 25 వేల రూపాయలు విరాళం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సుధా ప్రసాద్ రెడ్డి సెక్రటరీ లక్ష్మీకాంత్ రెడ్డి పిడిజీలు కల్లూరు రామలింగారెడ్డి కందుకూరు శ్రీరామమూర్తి జయ క్రిష్ణ కైలాస్ నాథ్ రెడ్డి లక్ష్మీనారాయణ రామచంద్రయ్య సుధా మోహన్ రెడ్డి రాగి రమేష్ ఎంసీ మోహన్ రెడ్డిధనుంజయ కార్తీక్ బాలకృష్ణుడు మరియు గోశాల సభ్యులు పాల్గొన్నారు.

## ఆగస్టు 5న కళాశాల బందుకు పిలుపునిచ్చిన ఏబీవీపీ



**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 02 . (నంది పత్రిక ):**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆంధ్ర ప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో, ఆగస్టు 5న కళాశాలల బందుకు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా కన్వీనర్ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యారంగా సమస్యల పరిష్కారాలు కోరుతూ, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నటు వంటి ఈ బందును, ప్రతి ఒక్క కళాశాల యాజమాన్యాలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు బందుకు మద్దతు ఇవ్వగలరని ఏబీవీపీ నంద్యాల శాఖ తరపున కోరుతున్నాము..

## చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంకు విరాళం



**బనగానపల్లె ఆగష్టు2నందిపత్రిక** నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం అభివృద్ధి కి ఆదివారం నందవరం గ్రామ వాస్తవ్యులు కీ“శే“ నేట్ల సుదర్శన్ రెడ్డి జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని సులోచన వారి కుమార్తెలు . హర్షిత, . హరిణిత ఆలయ అభివృద్ధి కొరకు రూ.28,310 చందాను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందచేశారు.

# నంద్యాల ఆటోనగర్‌లో.. స్థలం వివాదంలో గ్యాస్ వెల్డర్ నిసార్ మృతి



ఆటోనగర్ పాత కమిటీ ఇన్‌ఛార్జ్ జాకీర్ వేధింపుల వల్లే గుండెపోటుతో నిసార్ మృతి చెందాడంటున్న తోటి కార్మికులు, బంధువులు ఆరోపణడబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నా.. ప్లాట్ (నంబర్ 380) కొలతలు చూపించకుండా జాకీర్ బెదిరింపులుస్థలంలో కనీసం షెడ్డు వేసుకోనివ్వకుండా నాలుగేళ్లుగా ముప్పుతిప్పలు పెట్టిన వైనం

తీవ్ర మానసిక ఒత్తిడి, మనస్తాపంతో పని చేస్తున్న చోటే గుండెపోటుకు గురైన నిసార్మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు.. ఒక పాప వయసు కేవలం నెల రోజులే! కలెక్టర్, ఎస్పీ, మంత్రుల చుట్టూ తిరిగినా ఆటోనగర్ కార్మికులకు న్యాయం దక్కలేదని ఆవేదనఆటోనగర్ జాకీర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్నిసార్ కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు.. మిగతా 50 మంది కార్మికులకు వారి స్థలాలు అప్పగించాలని పట్టు

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 2 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణ శివారులోని ఆటోనగర్‌కు చెందిన 32 ఏళ్ల గ్యాస్ వెల్డర్ నిసార్ నిన్న సాయంత్రం పని చేస్తున్న చోటే గుండెపోటు రావటం తో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే ఇది కేవలం గుండెపోటు కాదని, ఆటోనగర్ పాత కమిటీ ఇన్‌ఛార్జ్ పాపా సాహెబ్ జాకీర్ పెట్టిన తీవ్ర మానసిక ఒత్తిడి, వేధింపుల వల్లే నిసార్ ప్రాణాలు కోల్పోయాడని తోటి కార్మికులు, కుటుంబ సభ్యులు మీడియా ముందు ఆరోపించారు.నిసార్ తండ్రి హయాంలో ప్రభుత్వం వారికి ఆటోనగర్‌లో స్థలాన్ని (ప్లాట్ నంబర్ 380, సర్వే నంబర్ 468) కేటాయించింది. ఆ స్థలానికి డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ కూడా పూర్తి చేసుకున్నారు. అయినప్పటికీ, ఆ స్థలం ఎక్కడుందో కొలతలు చూపించకుండా జాకీర్ గత నాలుగేళ్లుగా నిసార్‌ను ముప్పుతిప్పలు పెడుతున్నాడు. ప్రాధేయపడినా కనికరించకపోగా, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగితే ఆ స్థలాన్ని ఇతరులకు అమ్మేస్తానని తీవ్ర బెదిరింపులకు పాల్పడినట్లు కార్మికులు వాపోతున్నారు.రోజుకు 200 నుంచి 300 రూపాయలు సంపాదించుకునే నిసార్ మృతితో.. ఆయన కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. ఆయనకు భార్య, ఇద్దరు చిన్న ఆడపిల్లలు ఉండగా.. అందులో ఒక పాప వయసు కేవలం నెల రోజులే కావడం అందరినీ కలచివేస్తోంది.

గత ఏడాదిగా తహశీల్దార్, కలెక్టర్, ఎస్పీ, మంత్రుల చుట్టూ తిరిగినా ఆటోనగర్ కార్మికులకు ఎలాంటి న్యాయం జరగలేదని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బంధువులు.. నిందితుడు జాకీర్‌ను వెంటనే విచారించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, అలాగే ఇబ్బందులు పడుతున్న మిగతా 50 మంది కార్మికులకు వారి స్థలాలను అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.ఆటో నగర్ లో దాదాపు ఇంకా 50 మంది ఇలాగే ఇబ్బంది పడుతున్నా ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షులు జాకీర్ కు రాజకీయ అండదండలు పుష్కలంగా ఉండడంతో బాధితులు ఇబ్బందులకు గురవుతున్నారు.ఆటో నగర్ లో జమా ఖర్చులు గోల్మాల్ జరిగాయని బాధితులు ఆరోపిస్తున్న నేటికి లెక్కలు చూపించకుండా నేతలు,అధికారులు ఆటో నగర్ జాకీర్ కె మద్దతు తెలిపిన విషయం విదితమే.ఆటో నగర్లో ఇంకా ఎంత మంది వేధింపులు కు మృతి చెందాలి.చిన్న వయసులో నిసార్ మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డుపాలైంది. డబ్బు,పలుకుబడి ఉంటే ఎవరు ఏమి చేయలేరని మరో సారి నిజమైంది.ఆటో నగర్లో ఎంతో మంది బాధితులు ఉన్నా వారికి న్యాయం చేసే నాధుడే కనిపించడం లేదు.వేదింపులకు మృతి చెందిన నిసార్ కుటుంబాన్ని రాజకీయ నాయకులు,అధికారులు ఆదుకుంటారో లేదో వేచిచూద్దాం.



# స్నేహానికి సార్థకత

## రక్తదానంతో ఆదర్శంగా నిలిచిన 2002-2007 బ్యాచ్ పూర్వ విద్యార్థులు





**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 02 (నంది పత్రిక):** స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రుద్రవరం మండల కేంద్రంలోని అమ్మవారిశాల సెంటర్ వద్ద ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి జిల్లా పరిషత్ పాఠశాలలో 2002-2007 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మరియు నంద్యాల బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'మెగా రక్తదాన శిబిరం' విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు మండల యువకులు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది, వ్యాపారస్తులు, ఆటో డ్రైవర్లు మరియు రైతులు ఉత్సాహంగా పాల్గొని 60 మందికి పైగా రక్తదానం చేయడం విశేషం. ఈ సేవా కార్యక్రమానికి మద్దతుగా లింగం శోభన్ బాబు రక్తదాతలకు ఓఆర్ఎస్ జ్యూస్ అందించగా, అమ్మవారిశాల సెంటర్‌లో బండిపై పండ్లు అమ్ముకునే ఒక పేద మహిళ "నేను సైతం" అంటూ తనవంతుగా రక్తదానం చేసిన వారికి పండ్లను ఉచితంగా అందజేసి పెద్దమనసు చాటుకున్నారు. ఆ మహిళ చూపిన ఉదారతకు ముగ్ధులైన ముఖ్య అతిథులు ఎస్ఐ జయప్ప, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ మరియు పూర్వ విద్యార్థులు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ నంద్యాల బ్లడ్ సెంటర్, వాయిస్ ఆఫ్ రుద్రవరం, ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం సంయుక్తంగా సర్టిఫికెట్లు అందజేయగా, 2002-2007 బ్యాచ్ తరపున స్టీల్ బాటిళ్లను బహుమతిగా అందించారు. భవిష్యత్తులో కూడా ఈ బ్యాచ్ ఎప్పటికీ ఇలాగే కలిసిమెలిసి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని రుద్రవరం గ్రామస్తులు ఆకాంక్షించగా, కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పూర్వ విద్యార్థులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.





# ఎస్పీవై రెడ్డి స్మార్ట్ సిటీ కాలనీ లో డోర్ టు డోర్ .

## కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల పై కాలనీ ప్రజలకు వివరిస్తున్న వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు



**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 2 ( నంది పత్రిక )** నంద్యాల టౌన్ పరిధిలోని 38వ వార్డు ఎస్పీవై రెడ్డి స్మార్ట్ సిటీ కాలనీ లో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డోర్ టు డోర్ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు గారు మాట్లాడుతూ నంద్యాల ఎమ్మెల్యే, రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి వర్యులు ఫరూక్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి .ఫిరోజ్, రాష్ట్ర యువ నాయకుడు .ఫయాజ్ గారి ఆదేశాల మేరకు డోర్ టు డోర్ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది అని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు,వార్డు లో చేసిన అభివృద్ధి పనులు గురించి కాలనీ ప్రజలకు తెలియజేయడం జరిగింది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు లింగమయ్య,మధురెడ్డి,నారాయణ రెడ్డి,శేఖర్, సుబ్బారాయుడు, ప్రవీణ్, మణి కుమార్, నాగ శేషులు, శంకర్ గౌడ్, చిన్నరాయుడు,నరేష్,రామస్వామి,అబ్దుల్లా తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా స్నేహితుల ఆత్మీయ సమ్మేళన వేడుక.

## ఎస్ఎస్‌సీ పూర్తి చేసి 35 ఏళ్లు స్నేహబంధానికి ఘన వేడుక

## జీహెచ్ఎస్ నందికొట్కూరు 199091 ఎస్ఎస్‌సీ బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం




**నందికొట్కూరు, ఆగస్టు 2(నంది పత్రిక )** జీహెచ్ఎస్ నందికొట్కూరు 199091 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు ఎస్ఎస్‌సీ పూర్తి చేసి 35 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా, అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం వేళ నిర్వహించిన ఆత్మీయ స్నేహ సమ్మేళనం హృద్యంగా, ఉత్సాహభరితంగా జరిగింది.ప్రస్తుతం సుమారు 50 ఏళ్ల వయస్సులో ఉన్న బాల్యమిత్రులు మూడు దశాబ్దాలకు పైగా అనంతరం ఒకే వేదికపై కలుసుకుని పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆప్యాయతను పంచుకున్నారు.ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నాగిరెడ్డి, మల్లికార్జున, కడియం సుబ్రహ్మణ్యం, కె.జె.ఎల్. కుమార్, సుబ్బయ్య (పీ.ఈ.టీ.), నాగసుబ్బయ్య (హిందీ), శేషమ్మ, సుమన్ మేడం సేవలను కృతజ్ఞతతో స్మరించుకున్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు సిద్దయ్య, ఉపాధ్యాయులు తిరుపతి రెడ్డిల సమక్షంలో గురువులను ఘనంగా సన్మానించారు.బ్యాచ్ సభ్యుడు గుజ్జుల గౌరీశ్వర నాయుడు హాజరైన ప్రతి మిత్రునికి స్నేహానికి గుర్తుగా ప్రత్యేక జ్ఞాపికను అందజేయగా, సహచరులందరూ ఆయనను అభినందించారు.పెరుమాళ్ల శ్రీనాథ్, సుదిరెడ్డి రమేష్ రెడ్డి, జాకీర్, లక్ష్మీనారాయణ రెడ్డి, జగదీశ్వర రావు, శ్రీనివాసరెడ్డి, మాలె రాజేష్, మాలె నాగరాజు, ఫణీశ్వర శర్మతో పాటు రాష్ట్రంలోని, దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన బ్యాచ్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువుల సన్మానం, జ్ఞాపికల అందజేత, సామూహిక ఫొటోలు, బాల్యస్మృతుల పంచుకోవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేశాయి.




# జలాదివాసాని చేరువలో సంగమేశ్వరాలయం



**కొత్తపల్లి - నంది పత్రిక:** కృష్ణానది నుంచి వరద నీరు ఉధృతంగా శ్రీశైలం జలాశయం వైపు పరుగులు పెడుతుంది. ఆదివారం నాటికి జూరాల ప్రాజెక్ట్ నుంచి శ్రీశైలం జలాశయానికి 1,51,366 క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. దీంతో జలాశయం నీటిమట్టం 885 అడుగులకు గాను 838.20 అడుగులకు చేరుకుంది. దీంతో శ్రీశైలం వెనుకజలాలు ప్రాచీన సంగమేశ్వరాలయాన్ని చుట్టముట్టాయి. ఆలయ ముఖ మండపం పైకి కృష్ణానదీ జలాలు చేరాయి. రెండు రోజుల్లోనే ఆలయం జలాధివాసానికి చేరువలో ఉండడంతో ఆలయాన్ని సందర్శించేందుకు భక్తులు, సందర్శకుల తాకిడి దేశ నలుమూలల నుంచి ఎక్కువైంది. పెరుగుతున్న కృష్ణాజలాలో చిన్న, పెద్ద, యువతి, యువకులు ఎంతో ఉల్లాసం సందడి చేశారు.

# కూటమి పాలన పై వైఎస్సార్సీపీ ఉద్యమ బాట

**బనగానపల్లె ఆగష్టు 2నందిపత్రిక** రెండేళ్ల కూటమి పాలన పై వైయస్సార్ పార్టీ చేపడుతున్న ఉద్యమ బాట పై కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు సోమవారం స్థానిక టౌన్ భవనంలో నియోజకవర్గ స్థాయి సమావేశం మాజీ శాసన సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ ప్రచార కార్యదర్శి సిద్ధం రామ మోహనరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో బనగానపల్లె నియోజకవర్గ టౌన్ హాల్ మీటింగ్ ఏర్పాటు చేయడమైనది.ఈ సమావేశానికి బనగానపల్లె నియోజకవర్గంలోని వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు, అన్ని అనుబంధ సంఘాల కన్వీనర్లు, సభ్యులు, సోషల్ మీడియా సభ్యులు మరియు పార్టీ శ్రేణులు అందరూ తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయవలసిందిగా కోరడమైనదని అందులో పేర్కొన్నారు.

# కొలిమిగుండ్ల లో చారిత్రక గుడుల పునరుద్దరణ



**కొలిమిగుండ్ల ఆగష్టు 2నందిపత్రిక** కొలిమిగుండ్ల లో ఆదివారం పూర్వసంపద రక్షక సేన ఆధ్వర్యంలో సుమారు 1600 ఏళ్ల చారిత్రక వైభవాన్ని సంతరించుకున్న కొలిమిగుండ్ల గ్రామంలోని "నాలుగు గుళ్ల" పునరుద్ధరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమం లో మంత్రి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి పాల్గొని భక్తులతో కలిసి ఆలయ ప్రాంగణాన్ని స్వచ్ఛంగా శుభ్రపరిచి, మట్టితో రూపొందించిన శ్రీ వినాయకుడు మరియు శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వసంపద రక్షక సేన సభ్యులు, ప్రముఖ యూట్యూబర్ లక్ష్మీకాంత్, సెర్బియాకు చెందిన ప్రముఖ పర్యావరణవేత్త లాజర్, అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నంద్యాల తిరిగే బస్సులు సమయాన్ని పాటించాలి

## ప్రయాణికులకు అనుగుణంగా బస్సు సర్వీసులు పెంచాలి :సిపిఎం



**నంది పత్రిక ఆత్మకూరు- ఆత్మకూరు:** ఆత్మకూరు - నంద్యాల, నంద్యాల నుంచి ఆత్మకూరు తిరిగే బస్సులు సమయాన్ని పాటించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని, అదనంగా బస్సు సర్వీసులు పెంచాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఏసురత్నం, పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్ లు అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడపాలని ఆర్టీసీ సీఐ నాయక్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రవేశపెట్టింది. ఈ పథకం వల్ల ప్రయాణికుల సంఖ్య తీవ్రంగా పెరిగిందన్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేవు. ఆత్మకూరు నుంచి నంద్యాల తిరిగే బస్సులు సమయాన్ని పాటించడం లేదు. బస్సులన్నీ ఒకేసారి పోవడం ఒకేసారి రావడం మెజార్టీగా జరుగుతుందన్నారు. 80 మంది ప్రయాణికులు బస్సులు ఉంటే చాలు అనే కోణంలో చాలామంది డ్రైవర్స్ బస్సులను ఆపకుండా వెళుతున్నారు. చదువుకునే పిల్లలకు బడులకు పోయే పిల్లలకు వీటివల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు సాయంకాలము 5 గంటల నుంచి ఏడు గంటల వరకు నంద్యాలలో బస్సులు ఉండడం లేదు బస్సులన్నీ కూడా ఒకటేసారి మూడు నాలుగు బస్సులు వస్తున్నాయి ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు వందల మంది ప్రయాణికులు బస్టాండ్లో ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలేజీ పిల్లలు మహిళలు చాలా ఇబ్బందులు పడి నిరాశకు గురి అవుతున్నారు. నంద్యాల నుంచి ఆత్మకూరుకు సాయంకాలం బస్సులు సమయానికి నడిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆత్మకూరు నుంచి నంద్యాలకు గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది అందుకు అనుగుణంగా అదనంగా బస్సులు పెంచాలి, నంద్యాల నుంచి ఆత్మకూరుకు ఎక్స్ ప్రెస్ బస్సులను నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామ్ నాయక్, వీరన్న, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ సేవలపై పై క్యూ.ఆంకోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

## - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప బ్యూరో చీఫ్ ఆగస్టు 2 : నంది పత్రిక** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను కోరుతుందన్నారు. పిజిఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ. ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పిజిఆర్ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. . ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని కలెక్టర్ సూచించారు. క్యూ.ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ కు చేరుతుందని అన్నారు. ఆర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అల్లర్లు గొడవలకు తావివ్వద్దు

## - మద్యం అమ్మితే చర్యలు తప్పవు - ఎస్ ఐ జయశేఖర్

**కొత్తపల్లి - నంది పత్రిక :** ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో ప్రజలు అల్లర్లు, గొడవలకు తావు ఇవ్వకూడదని ఎస్సై జయ శేఖర్ హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలో పాత మాదుగుల గ్రామంలో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేపట్టారు. సోదాలలో భాగంగా గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వద్ద నుండి 18 క్వార్టర్ బాటిల్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామాలలో అందరూ కలిసిమెలిసి అన్నదమ్ముల వలె ఉండాలన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్న సామరస్యంగా పరిష్కరించుకోవాలి గాని అల్లర్లకు, గొడవలకు, ఘర్షణలకు పోకూడదన్నారు. ఎంతటి వారైనా ఇలాంటి వాడికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అన్నారు. గ్రామాలలో అక్రమంగా మద్యం అమ్మిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ సోదాలలో హెడ్ కానిస్టేబుల్ శేషారాం సింగ్, పోలీస్ కానిస్టేబుల్ లో ఉన్నారు



# 'రెండేళ్ల నమ్మకం సంక్షేమం, అభివృద్ధి' ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



**కర్నూలు సిటీ నందిపత్రిక** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రెండేళ్ల నమ్మకం సంక్షేమం, అభివృద్ధి' ఇంటింటి ప్రచార కార్యక్రమం కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గ పరిదిలో శివరాంపురం గ్రామంలో ఉత్సాహభరితంగా సాగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు కూలంకషంగా వివరించారు. ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటూ, 'రెండేళ్ల నమ్మకం సంక్షేమం, అభివృద్ధి' సమాచార కరపత్రాలను ప్రతి ఒక్కరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోంది. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. రాబోయే రోజుల్లో కూడా కోడుమూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మండల టీడీపీ కన్వీనర్ బుర్ర వెంకటేష్ నాయుడు,జిల్లా టీడీపీ మహిళా జనరల్ సెక్రటరీ పద్మ ,స్థానిక టీడీపీ నాయకులు సీతారామి రెడ్డి ,విక్రమ్,మహేష్,కృష్ణారెడ్డి, భాస్కర్, ఎల్లప్ప,రామన్న, దస్తగిరి,రాజశేకర్,తెలుగుదేశం పార్టీ బూత్, యూనిట్ మరియు క్లస్టర్ ఇన్చార్జీలు, స్థానిక నాయకులు, జనసేన-భాజపా శ్రేణులు, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లాలో తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలి






## సిపిఐ,ఏపి రైతు సంఘం

**కర్నూలు సిటీ నందిపత్రిక** రాష్ట్రంలో తీవ్ర వర్షాభావంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉందని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కర్నూలు జిల్లాలో కరువు చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు పి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు ఆదివారం నాడు సిపిఐ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కరువు పరిశీలన యాత్ర రెండో రోజు ప్రారంభంలో కల్లూరు మండలం లో పెద్దటేకూరు తడకనపల్లె తదితర గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏలినో ప్రభావం వలన తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల రైతుల తీవ్ర నష్టాల్లో ఉంటే ఆదుకోవలసిన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తోందని . మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పెట్టుబడిగా ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు పెట్టుబడి పెట్టి తీవ్రంగానష్టపోయారన్నారు. వర్షాలు పడక వేసిన పత్తి, వేరుసెనగ, కంది, మొక్కజొన్న, సజ్జలు, విత్తనాలు వేసి తీవ్రంగా నష్టపోయారని కర్నూలు జిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి, ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందజేయాలని, తెలంగాణ తరహాలో రూ.2 లక్షల వరకు రైతు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఉచితంగా విత్తనాలు, రసాయనిక ఎరువులు ఇవ్వాలని, అదేవిధంగా రైతులకు కరువు పెన్షన్ అందించడంతో పాటు వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసి గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మించి కర్నూలు జిల్లాకు తాగునీరు సాగు నీటి సమస్యనుపరిష్కరించాలని అలాగే ప్రస్తుతం కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి తక్షణమేకరువు సహాయం అందించాలని సిపిఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల మూడోవ తేదీన కల్లూరు మండల కార్యాలయం ముందర ధర్నాను మరియు 18వ తేదీన వేలాది మంది రైతులతో చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాలలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి దంభోళంశ్రీనివాసరావు ఏ ఐ వై యఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, ఓర్వకల్ మండల కార్యదర్శి రమేష్, ఏపీ రైతు సంఘం కర్నూలు సిపిఐ జిల్లా సమితి సభ్యులు సి మహేష్ నాగరాజు, భద్ర కుమార్, ప్రజానాట్యమండలి నాయకులు దప్పు మాణిక్యం, సుంకన్న,బద్రి, మధు,ఓరకల్లు మండల రైతు సంఘం కార్యదర్శి సుధాకర్, కల్లూరు మండల కార్యదర్శి రాముడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశంశలు అందుకుంటున్న మోడల్ స్కూల్ తెలుగు టీచర్ నాగరాజు కవిత.



**బేతంచెర్ల ఆగస్టు 02 ( నందిపత్రిక ).** స్నేహితుల దినోత్సవం ను పురస్కరించుకొని బేతంచెర్ల మండలం మోడల్ స్కూల్లో విధులు నిర్వహిస్తున్న తెలుగు టీచర్ గంగుల నాగరాజు కవిత వ్రాశారు.-- నా ప్రజ్ఞకు చేతో మొదం -- నా తెలివికి చప్పట్లు కొట్టేది, నా చెలిమి సామోదం - నా స్నేహానికి ఆనందం, జీవిత దీపానికి ఆముదం -- నా జీవితమనే దీపం ఆర్ప కుండా నూనె పోసేది, నా ప్రగతికి సుగతి మొదం-- నా ఎదుగుదలకు మంచి మార్గం ఆలంబన ఆత పత్రం -- స్నేహం అనేది ఎండలో నీడ నిచ్చే గొడుగు, స్నేహమే జీవితానికి కొత్త చరిత్ర అనే కవిత,అందరితో ప్రశంసలు పొందుతున్నది.

# భూటాన్ టోర్నీకి ఎంపికైన జగదీశ్వరిని అభినందించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి



**కర్నూలు సిటీ నందిపత్రిక** పాణ్యం నియోజకవర్గం : గడివేముల మండలం, పెసరవాయి గ్రామానికి చెందిన చిందుకూరు నాగేశ్వరరావు కుమార్తె జగదీశ్వరి అంతర్జాతీయ గోల్ షాట్ బాల్ ఛాంపియన్‌షిప్‌కు భారత జట్టు తరపున ఎంపిక కావడం పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి క్రీడారంగంలో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి, పాణ్యం నియోజకవర్గానికి మంచిపేరుతీసుకురావాలని ఆకాంక్షిస్తూ రూ.25,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి ప్రోత్సహించారు.కాగా, భూటాన్‌లో ఆగస్టు 24 నుంచి 27 వరకు జరిగే అంతర్జాతీయ గోల్ షాట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టు తరపున జగదీశ్వరిపాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో గడివేముల మండల నాయకులు ఎల్లారెడ్డి , మంచాలకట్ట అనిల్ కుమార్ రెడ్డి , సర్వేశ్వర రెడ్డి , బోయ కాంత్ , నాగేశ్వరరావు , వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# అక్రమంగా రోడ్డు తవ్వకాలను ఆపాలి.

## తాగునీటి పైప్ లైన్ పగలగొట్టినవారిపై చర్యలు తీసుకోవాలి.సిపిఐ



**కర్నూలు సిటీ నందిపత్రిక** కోడుమూరు పట్టణంలో ప్రజలు ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు రోడ్డు విస్తరణ కమిటీ కలసి అనేక ఉద్యమాలు నిర్వహించడం వల్లే రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని. అలాంటి రోడ్డును పగలగొట్టడానికి గుంతలు తవ్వుకోవడానికి ఎవరు పర్మిషన్ ఇచ్చారని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ కార్యదర్శి శేషు కుమార్ సిపిఐ మండల సహాయ కార్యదర్శి దూల్ల భాస్కర్ ప్రశ్నించారు. ఆదివారం కోడుమూరు పట్టణంలో స్థానిక అరుణోదయ బుక్ సెంటర్ దగ్గర ప్రైవేట్ కేబుల్ వాళ్లు తవ్వడం వల్ల పగిలిపోయి లీకైనటువంటి పైపులైను గుంతలను స్థానిక ప్రజలతో కలిసిపరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా శేషు కుమార్, దూల్ల భాస్కర్లు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా రోడ్డును వేయడం జరిగిందని అలాంటి రోడ్డును ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా తవ్వుతూ గుంతలు పెడుతూ ఆ రోడ్డు కింద ఉన్నటువంటి గాజులదిన్నె ప్రాజెక్టు నుండి కోడుమూరు పట్టణ ప్రజలకు త్రాగునీరు అందించేటువంటి పైపులైను ను డామేజ్ చేయడం జరిగిందని దీని ద్వారా పట్టణంలోని ప్రజలకు కుళాయిల ద్వారా వచ్చే నీరు కలుషితంగా ఎర్రగా వస్తుందని రోడ్డు పై పెట్టిన గుంతలు తుడుచుకున్న ఎక్కడికక్కడే వదిలేయడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ అడ్డ దిడ్డంగా తవ్వడం వల్ల కాలనీ వాసులకు, పాదాచారులకి, ద్విచక్రవాహనా దారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కేబుల్ లైన్ పేరుతో జేసీబీ లను పెట్టి క్రమంబద్ధంగా కాకుండా ఇష్టానుసారంగా రోడ్డు ను తవ్వుతున్న ఇక్కడ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పట్టణంలోని రోడ్లను , త్రాగునీటి సౌకర్యం అందించే పైపులైన్ లను ఇష్టానుసారంగా ధ్వంసం చేసి పట్టణ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆర్ అండ్ బి అధికారులు మరియు ఎంపీడీవో, గ్రామపంచాయతీ అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ వారు చేశారు. సిపిఐ నాయకులు మధు, బాబురావు, రజాక్, మరియు అల్లా బకాష్, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన ముఖ్య నేతల ఆత్మీయ సమావేశం లో పాల్గొన్న జనసేన నాయకులు సంధ్య విక్రమ్ కుమార్



**కర్నూలు సిటీ నందిపత్రిక** కోడుమూరు నియోజవర్గం కోడుమూరు మండలం జనసేన నాయకుల ముఖ్యనేతల ఆత్మీయ సమావేశం సంధ్యా విక్రమ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది ఈ సందర్భంగా సంధ్యా విక్రమ్ కుమార్ మాట్లాడితూ గ్రామభివృద్ధికి పవన్ కళ్యాణ్ చూపుతున్న చొరవ చేస్తున్న అభివృద్ధి ప్రతి గడపకు తీసుకొని పోవాల్సిన అవసరం బాధ్యత మనపై ఉంది అని అలాగే కూటమి ప్రభుత్వం లో జరుతున్న అభివృద్ధి ప్రజలకు వివరంగా చెప్పాలని రేపు జరగబోయే స్థానిక సంస్థ ల ఎన్నికల్లో కూటమి సభ్యుల గెలుపు కోసం మరియు మన కూటమి ధర్మం పాటిస్తూ జనసేన పార్టీ కి వచ్చే ప్రతి స్థానాన్ని కైవసం చేసుకొని మన అధినేత పవన్ కళ్యాణ్ కీ మన ప్రియతమా నాయకులు చింతా సురేష్ నేతృత్వం లో కానుక ఇదాం అని పిలుపునిచ్చాడు ఈ కార్యక్రమం లో భారీగా కోడుమూరు మండల ముఖ్యనేతలు మరియు వీరమహిళలు జనసైనికులు భారీగా పాల్గొన్నారు

# అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించిన వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి





**కర్నూలు సిటీ నందిపత్రిక** చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన కాటసాని రామభూపాల్ రెడ్డి అనంతరం ఎమ్మెల్యే విరూపాక్షి నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి , ఆయన కుమారుడు చంద్రశేఖర్‌ను అర్ధరాత్రి సమయంలో పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.కర్నూలు జిల్లా చిప్పగిరిలో రాత్రి 2.45 గంటల సమయంలో భారీ పోలీసు బలగాలను మోహరించి, ఎమ్మెల్యే నివాసం తలుపులు బద్దలు కొట్టి దౌర్జన్యంగా ఇంట్లోకి ప్రవేశించి అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలను కాలరాసే చర్య అని ఆయన మండిపడ్డారు.చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత గిరి ఇంటిపై టీడీపీ నాయకుడు నాగరాజు, అతని అనుచరులు దాడికి పాల్పడగా బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఎమ్మెల్యే విరూపాక్షి వెళ్లారని తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ గూండాలు ఎమ్మెల్యేపై రాళ్లు రువ్వడంతో ఆయన సోదరుడు శ్రీరాముడు గాయపడ్డారని పేర్కొన్నారు ఈ ఘటనపై టీడీపీ నాయకులపై ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా, బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి వారినే లక్ష్యంగా చేసుకుని ఎమ్మెల్యే విరూపాక్షి , ఆయన కుమారుడిపై కేసులు నమోదు చేసి అర్ధరాత్రి అరెస్టు చేయడం ప్రభుత్వ కక్షసాధింపు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.ప్రజల కోసం పోరాడుతున్న ప్రజాప్రతినిధులను భయపెట్టే ప్రయత్నాలు ఎంత చేసినా వైఎస్సార్‌సీపీ వెనక్కి తగ్గదని, అక్రమ కేసులు, అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్య గొంతును అణచివేయలేరని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఆదోని మాజీ శాసనసభ్యులు సాయి ప్రసాద్ రెడ్డి , మాజీ మంత్రి శైలజానాథ్ ,ఎమ్మెల్సీ ఇషాక్ భాషా ,అనంతపురం మాజీ ఎంపీ తలారి రంగయ్య , ఎమ్మెల్సీ మధుసూదన్ , మాజీ పార్లమెంట్ సభ్యురాలు బుట్టా రేణుక , పత్తికొండ మాజీ శాసనసభ్యురాలు శ్రీదేవి , కర్నూలు నగర మాజీ మేయర్ బి.వై రామయ్య , అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి ,ప్రదీప్ రెడ్డి , పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ బళ్లారి రాఘవ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

## జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు.



**కడప బ్యూరో చీఫ్, ఆగస్టు 2: నంది పత్రిక** తెలుగు నాటక రంగ పితామహుడు, మహానటుడు శ్రీ బళ్లారి రాఘవ జయంతి ఉత్సవాలను ఆదివారం కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీ బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ, శ్రీ బళ్లారి రాఘవ తెలుగు నాటక రంగానికి విశిష్ట సేవలు అందించి, తన అసాధారణ నటనా ప్రతిభతో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. కళారంగ అభివృద్ధికి ఆయన చేసిన కృషి నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని కళా, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టెప్ సిఈఓ బి వి ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖాధికారి శ్రీ సురేష్ కుమారు, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేటు టీచర్ పైశాచికత్వం



## బాలిక దీవెనకు గాయాలు

## ప్రశ్నిస్తే ఎదురు దాడికి దిగిన టీచర్



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 2 :** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు గ్రామంలోని డాక్టర్ నరేంద్ర మెమోరియల్ ప్రైమరీ స్కూల్లో అదే గ్రామానికి చెందిన దీవెన(7) బాలికపై అదే గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు టీచర్ పైశాచికంగా చితకబాదిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం మేరకు ప్రైవేటు స్కూల్లో రెండవ తరగతి చదువుతున్న దీవెనను ప్రైవేట్ టీచర్ చితకబాగింది. దీనితో ఆ బాలికకు వీపు వెనుక విపరీతంగా గాయాలయ్యాయి. ఈ విషయం ఇంట్లో చెబితే నిన్ను చంపేస్తానని బాలికను ప్రైవేటు టీచర్ బెదిరించినట్లుగా తెలుస్తోంది. దీవెన తల్లిదండ్రులైన కొండయ్య నందిని ఆళ్లగడ్డలో స్లాబు పనికి వెళ్లారని తెలుస్తోంది. ప్రైవేట్ స్కూల్ నుండి ఇంటికి వచ్చిన దీవెన తల్లిదండ్రులు లేకపోవడంతో తమ బంధువుల ఇంట్లో తలదాచుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ సంఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. ఆదివారం ఉదయం స్నానానికి వెళ్లి వచ్చిన దీవెన బట్టలు వేసుకోవడానికి అవస్థలు పడుతూ ఉండటంతో, తల్లిదండ్రులు గమనించారు. తమ కూతురు ఒంటిపై గాయాలు చూసి ఆందోళనకు గురయ్యారు. జరిగిన సంఘటన గురించి దీవెన జేజమ్మ ప్రైవేట్ స్కూల్ టీచర్ ను ఈ విషయంపై నిలదీసేందుకు ఆమె ఇంటి వద్దకు వెళ్లినట్టుగా తెలుస్తోంది. జరిగిన సంఘటన గురించి, చెప్పాల్సిన టీచర్ నాగమ్మపై ఎదురుగాడికి దిగింది. దీంతో నాగమ్మ తలకు కూడా రక్త గాయమైంది. ఈ విషయంపై దీవెన తల్లిదండ్రులు ఆదివారం రాత్రి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. దీవెనపై జరిగిన దాడిని గురించి తెలుసుకున్న కరస్పాండెంట్ పుల్లయ్య ఆమెను విధుల నుంచి తొలగించినట్లుగా సమాచారం. దీవెనపై జరిగిన దాడి పట్ల ఈర్ణ పాడు గ్రామంలో ఆందోళనలు వ్యక్తం అవుతూ ఉన్నాయి.

# రైతు బజార్లలో ఏర్పాటుచేసిన తగ్గింపు ధరలకే బియ్యం విక్రయాలను రేషన్ కార్డు దారులు సద్వినియోగం చేసుకోవాలి





## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ,ఆగస్టు2, నంది పత్రిక** జిల్లాలో రైతు బజార్లలో ఏర్పాటుచేసిన తగ్గింపు ధరలకే బియ్యం విక్రయాలను రేషన్ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.

భీమవరం రైతు బజార్లో ఆదివారం తక్కువ ధరలకే బియ్యం విక్రయాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్ప శ్రీ, పీఏసీ చైర్మన్ భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరిగిన దృష్ట్యా తక్కువ ధరలకే సన్న రకం బియ్యం రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా రేషన్ కార్డుదారులకు విక్రయాల ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో 3 రైతు బజార్లు, 40 రైస్ మిల్లుల అవుట్లెట్స్ స్టోర్లలో తగ్గింపు ధరలకే బియ్యం విక్రయించడం జరుగుతుందని, ఈ విక్రయ కేంద్రాలలో స్టీమ్ బియ్యం కేజీ 52 రూపాయలకు, రా బియ్యం 50 రూపాయలకు విక్రయించడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రాలు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు తెరిచి ఉంటాయన్నారు. రేషన్ కార్డుకు 10 కేజీలు చొప్పున ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.రాష్ట్ర పీఏసీ చైర్మన్,భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగిస్తూ రైతు బజార్లో రాష్ట్ర వ్యాప్తంగా తగ్గింపు ధరలకే బియ్యం విక్రయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు.రాష్ట్రంలో 115 రైతు బజార్లలోనూ, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక పాయింట్లలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు అందిస్తారని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బహిరంగ మార్కెట్లో ధరల భారం నుంచి సామాన్య, మధ్యతరగతి కుటుంబాలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు, జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ తగ్గించిన ధరలతో వినియోగదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సునీల్ కుమార్, రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, మైనార్టీ కార్పోరేషన్ డైరెక్టర్ షబీనా బేగం, రైతు బజార్ ఎస్టేట్ అధికారి కల్యాణ్ పాల్గొన్నారు.



# ఆళ్లగడ్డ రోటరీ క్లబ్బు సేవలు ప్రశంసనీయం

## ఫాస్ట్ ప్రెసిడెంట్ వై పాపిరెడ్డి




**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 2 నంది పత్రిక** ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ సాధారణ సమావేశం ఆదివారం నాడు ఉదయం పట్టణంలోని రోటరీ క్లబ్ సమావేశ భవనంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం రోటరీ క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ యర్రం పాపిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముందుగా ప్రార్థన గీతంతో సమావేశం ప్రారంభమైంది ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ పాపిరెడ్డి క్లబ్బు మెంబర్స్ ను ఉద్దేశించి మాట్లాడుతూ ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం అని అన్నారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్ష కార్యదర్శులు పోలే పల్లె సత్యనారాయణ బైసాని రవి ప్రకాష్ తమ అమూల్యమైన సేవలతో వారి ఆధ్వర్యంలో క్లబ్బును ముందుకు నడిపించారని మంచి సేవా దృక్పథంతో పనిచేశారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని రోటరీ క్లబ్ ను నూతన అధ్యక్ష కార్యదర్శులు ఇంకా ముందుకు తీసుకెళ్లాలని ఆయన అభిప్రాయపడ్డారు. యువత ముందుకొస్తున్నారని వారందరి సహకారంతో రోటరీ క్లబ్బుకు నూతన ఒరవడిని ఏర్పాటు చేసుకొని మంచి గుర్తింపు తేవాలని తెలిపారు, అనంతరం మాజీ రోటరీ క్లబ్ ప్రధాన కార్యదర్శి బైసాని రవి ప్రకాష్ క్లబ్బు సేవలు తదితర అంశాలను గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి గాండ్ల చంద్ర సేన రాబోయే రోజుల్లో రోటరీ క్లబ్ చేసే కార్యక్రమాలు గురించి వివరిస్తూ అందరి సహాయ సహకారాలతో ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ ను మరో ముందడుగు వేసే విధంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో అగ్రభాగాన నిలిచేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ సీనియర్ ఫాస్ట్ ప్రెసిడెంట్ ప్రిన్సిపాల్ శంకర్ రెడ్డి క్లబ్బు సీనియర్లు బ్యాంకు బాలిరెడ్డి, కెవి సుబ్బారెడ్డి మా టీవీ ప్రసాద్ ఎంఎస్ నారాయణరెడ్డి నిచ్చెన మెట్ల రామయ్య సోముల శేఖర్ రెడ్డి శివ చంద్రారెడ్డి,,రేపాకుల శ్రీనివాసులు సూర్య చంద్ర రెడ్డి, డిదస్తగిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత గ్రామాలలో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు, వైద్య శిబిరాలు



**ఏలూరు బ్యూరో చీఫ్, ఆగష్టు, 2 నంది పత్రిక:** జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశాలతో వరద ప్రభావిత గ్రామాలలో అధికార యంత్రాంగం ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టింది. వరదనీరు తగ్గిన తరవాత అంటువ్యాధులు, దోమలు ప్రబలకుండా గణపవరం, అమరవరం , మారేడుబాక, కుక్కునూరు, వేలేరుపాడు, శివకాశీపురం, తోటకూరగొమ్ము, భూదేవిపేట, దాచారం, గొమ్ముగూడెం, రేపాకగొమ్ము, రుద్రంకోట, తదితర గ్రామాలలో బ్లీచింగ్ చల్లించడం, దోమల నియంత్రణ మందులను స్ప్రే జిల్లా మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది చేశారు. దాచారం, శివకాశీపురంలలో ఏర్పాటుచేసిన వరద సహాయక కేంద్రాలలో బాధితులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. వరద ప్రభావిత గ్రామాలలోని ప్రజలకు ట్యాంకుల ద్వారా రక్షిత మంచినీటిని అందించారు. ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టాలు సంభవించకుండా ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలు వరదనీటి మునిగిన గ్రామాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరద సహాయక కేంద్రాలు, వరద ప్రభావిత గ్రామాలలో వైద్య శిబిరాలను వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటుచేసింది.



# విద్యార్థులు కష్టపడి ఇష్టపడి చదివితే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చు

# విద్య ద్వారా మంచి భవిష్యత్తు గుర్తింపు లభిస్తుంది





## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 2 నంది పత్రిక** విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చుని, విద్య ద్వారా మంచి భవిష్యత్తు, గుర్తింపు లభిస్తుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.వాసవి పెనుగొండలో ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థినుల హాజరు, వసతి గృహంలో ఉన్న సౌకర్యాలు, తాగునీరు,పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. స్కూల్ యూనిఫామ్, ఉచిత పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, ఇచ్చారా లేదా, భోజనం రుచికరంగా ఉంటుందా, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారా, ప్రతిరోజు ఉదయం యోగ అభ్యాసం చేస్తున్నారా లేదా అంశాలను కలెక్టర్ విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో సౌకర్యాలు బాగున్నాయని తమకు ఎటువంటి సమస్యలు లేవని విద్యార్థినులు కలెక్టర్ కు చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని విద్య ద్వారా మంచి భవిష్యత్తు గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థినిలు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంలో అక్కడ ఉన్న విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ తమ పిల్లలు ఎలా చదువుతున్నారు ఎప్పటికప్పుడు హాస్టల్ను సందర్శించి పిల్లల విద్యా ప్రగతిని తెలుసుకోవాలన్నారు. పదవ తరగతి తర్వాత ఏ ఏ కోర్స్ చెయ్యాలి, ఏ కోర్సు చేయడం ద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందో విద్యార్థులకు ఇప్పటి నుండే కెరియర్ గైడెన్స్ ద్వారా తెలియజేయాలని హాస్టల్ అధికారులకు సూచించారు. మండల స్థాయి అధికారులు తరచుగా హాస్టల్స్ ను సందర్శించి విద్యార్థిని విద్యార్థుల విద్యా ప్రగతి తెలుసుకోవాలన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా రెవెన్యూ రెవిన్యూ డివిజన్ అధికారి దాసిరాజు విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అంతకుముందు పెనుగొండలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఎలా చదువుతున్నారు, సౌకర్యాలు ఏ విధంగా ఉన్నాయి, విద్యా బోధన తదితర వివరాలు వారిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజనల్ అధికారి దాసిరాజు తదితరులు ఉన్నారు. ..





# యాదావిధిగా నేడు (ఆగస్టు3న) జిల్లా, డివిజన్, మండల కేంద్రాల లో ప్రజా సమస్య ల పరిష్కార వేదిక

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ చీఫ్, ఆగస్టు2 నంది పత్రిక.**జిల్లా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంఆగస్టు 3వ తేదీన జిల్లా కలెక్టరేట్తో పాటు అన్ని డివిజన్ మరియు మండల కేంద్రాలలో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారులి. అదేవిధంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం కూడా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సంబంధిత ఆధార పత్రాలతో సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అర్జీల స్వీకరణ, పరిశీలన మరియు పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా మరియు మండల స్థాయి అధికారుల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారిక వెబ్సైట్ ఎవవఎశీయఖఎ.ఖజూ.న్రశీజ.ఱఅ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీల స్థితి, పరిష్కార ప్రక్రియ లేదా ఇతర సమాచారం కోసం "మీకోసం" టోల్ ఫ్రీ హెల్ప్లైన్ నంబర్ 1100 ను సంప్రదించవచ్చని సూచించారు. క్యూఆర్ కోడ్ ను ఉపయోగించుకొని మీరు పెట్టుకున్న అర్జీ నెంబర్ కి ఫీడ్ బ్యాక్ ఇస్తే, తదుపరి సంబంధిత అధికారి మిమ్మల్ని సంప్రదిస్తారని అన్నారు. నడవలేని వారు, మంచానికే పరిమితమైన వారు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పిజిఆర్ఎస్ కేంద్రాలకు తీసుకురావద్దని తెలిపారు. అలాంటి వారి సమస్యలను కుటుంబ సభ్యులు లేదా ప్రతినిధుల ద్వారా తెలియ జేయవచ్చని పేర్కొన్నారు. పిజిఆర్ఎస్కు హాజరయ్యే ప్రజల కోసం తాగునీరు, అల్పాహారం, భోజనం వంటి సౌకర్యాలతో పాటు వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. అందిన అర్జీలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కా రానికి తక్షణ చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ స్పష్టం చేశారు. .



# వాటర్ గ్రిడ్ పైప్ లైన్ పనులు కారణంగా రోడ్డు దెబ్బ తిన్న ప్రాంతాలను నాణ్యతతో పునరుద్ధించాలి.

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు2 నంది పత్రిక** మార్టేరు–కోడేరు రాష్ట్ర రహదారి వెంబడి జరుగుతున్న వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ పైప్ లైన్ నిర్మాణ పనులను ఆదివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత శాఖల అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలి అధికారులకు పలు సూచనలు చేశారు. పైప్ లైన్ పనులు కారణంగా దెబ్బతిన్న రహదారి పనులను ఎలాంటి రాజీ లేకుండా నాణ్యత తో పునరుద్దించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా రోడ్డు పాడైన ప్రాంతాలలో తగిన విధంగా రోలింగ్ నిర్వహించి రహదారి పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో రహదారి కృంగి పోవటం, గుంతలు పడటం వంటివి లేకుండా శాశ్వత పరిష్కారం ఉండేలా పనులు చేపట్టాలని సూచించారు. వాటర్ గ్రిడ్ వంటి ప్రయోజన ప్రాజెక్టు పనులు అత్యంత ముఖ్యమైనవి అని, అయితే వాటి అమలు వల్ల ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంలో జిల్లా ఆర్ అండ్ బి శాఖ అధికారి ఏ శ్రీనివాస్, ఆర్డీవో దాసిరాజు, గ్రామీణ నీటి సరఫరా, రోడ్డు భవనాల శాఖ అధికారులు ఉన్నారు. .



# కోడేరు రేవు వద్ద పడవ మీద నుండి గోదావరి వరద ఉధృతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి





## వరద తగ్గుముఖం పట్టి సాధారణ స్థితికి వచ్చేంతవరకు అధికారులు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్, ఆగస్టు 2, నంది పత్రిక** జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదివారం ఆచంట మండలం కోడేరు రేవు వద్ద పడవ మీద నుండి గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా లంక గ్రామాలలో వరద పరిస్థితిపై సంబంధిత అధికారులతో చర్చించారు. వరద తగ్గుముఖం పట్టి, సాధారణ స్థితికి వచ్చేంతవరకు అధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పల్లెపాలెం, అయోధ్య లంక గ్రామాలలో వరద నీరు చేరలేదని, రోడ్ల వరకు మాత్రమే ఉందని ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం అప్రమత్తతో ఉందన్నారు. ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ముందస్తు జాగ్రత్తగా లోతట్టు ప్రాంత ప్రజలను, గర్భిణీ స్త్రీలను, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు చేర్చడం జరిగింది అన్నారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా బాధితులకు అందించేందుకు బియ్యం, నిత్యవసర వస్తువులు అందించేందుకు సిద్ధం చేయడం జరిగిందన్నారు. లంక గ్రామాలలో ఉద్యాన పంటలు ఏమైనా నష్టం వాటిల్లతే వాటిని పరిశీలించడం జరుగుతుందన్నారు. వరద ఉధృతి తగ్గిన తరువాత లంక గ్రామాలలో ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా క్లీనింగ్, శానిటేషన్ చేయడం జరుగుతుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు.







# భీమవరం రైతుబజారు ను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ





**భీమవరం, బ్యూరో చీఫ్ ఆగస్టు 2, నంది పత్రిక** భీమవరం జాయింట్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ ఆదివారం భీమవరం రైతు బజారును ఆకస్మికంగా పరిశీలించారు. రైతు బజార్‌లో రైతులు వినియోగదారులకు విక్రయిస్తున్న కూరగాయలు, పండ్లు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, నాణ్యత, తూకం, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రైతులు ఏ ప్రాంతం నుండి వస్తున్నారు, ఏ ఏ ఉత్పత్తులు విక్రయిస్తున్నారు రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు తాము స్వయంగా పండించిన కూరగాయలను రైతు బజార్లలో విక్రయించాలన్నారు.రైతులు, వినియోగదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. రైతు బజార్‌లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, ముఖ్యంగా మాంసం విక్రయ దుకాణాల వద్ద మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. ధరల పట్టికలను స్పష్టంగా ప్రదర్శించాలని, తూకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంట మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కే సునీల్ కుమార్ ఎస్టేట్ అధికారి కళ్యాణ్ పాల్గొన్నారు.



# ఘనంగా బళ్లారి రాఘవ జయంతి

### బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాల వెసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి




**ఏలూరు బ్యూరో చీఫ్, ఆగస్టు , 2 నంది పత్రిక** బళ్ళారి రాఘవ జయంతి ని కలెక్టరేట్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి బళ్ళారి రాఘవ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ తెలుగు నాటకరంగ ప్రముఖులన్నారు. తెలుగు, కన్నడ, ఇంగ్లీషు, హిందీ భాషలన్నింటిలోనూ రాఘవ నాటక ప్రదర్శన;లిచ్చారన్నారు. రాఘవ శ్రీలంక, ఇంగ్లాండు, ఫ్రాన్సు, జర్మనీ, స్విట్జర్లాండ్ వంటి దేశాలు పర్యటించి భారతీయ నాటకాలు, కళలగురించి ఉపన్యాసాలు, సెమినార్లు ఇచ్చారని , 1927లో ఇంగ్లాండులో లారెన్స్ ఆలివర్, ఛార్లెస్ లాటన్ ప్రభృతులతో కలిసి ప్రదర్శనాలిచ్చారని, 1919 జనవరిలో బెంగుళూరులో జరిగిన ఫెస్టివల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్ లో రఘవ పఠాన్ రుస్తుంగా ప్రదర్శించిన అభినయాన్ని రవీంద్ర నాథ్ టాగూర్ ఎంతగానో మెచ్చుకున్నారన్నారు. ప్రముఖ న్యాయవాది అయినప్పటికీ నాటకాలపై ప్రత్యేక అభిమానం, ప్రతిభతో నాటకాలలో రాణించారని, తన సమయాన్ని, సంపదను నాటక రంగ పురోగతికోసం వెచ్చించిన మాహా మనిషి బళ్లారి రాఘవ అని కలెక్టర్ కొనియాడారు ఈ కార్యక్రమంలో డిఆర్ఓ శ్రీదేవి, జిల్లా పర్యాటకాధికారి పట్టాభి, ప్రభృతులు పాల్గొన్నారు.

# ఈనెల 3వ తేదీ సోమవారం యధావిధిగా పీజీఆర్ఎస్ మరియు రెవిన్యూ క్లినిక్ ల నిర్వహణ

### 1100 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు, స్థితి తెలుసుకోవచ్చు అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చు, అర్జీ స్థితి తెలుసుకోవచ్చు

**ఏలూరు, బ్యూరో చీఫ్ ఆగస్టు, 2 నంది పత్రిక** ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో ఈనెల , 3వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి జిల్లా స్థాయిలో యధావిధిగా లిపిజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించబడతాయని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చున్నారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారిక వెబ్‌సైట్ ఎవవఎశీయుఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చుని తెలిపారు. పిజిఆర్ఎస్‌కు హాజరయ్యే ప్రజల కోసం తాగునీరు, భోజనం వంటి సౌకర్యాలతో పాటు వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. అందిన అర్జీలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెట్రిసెల్వి స్పష్టం చేశారు. ( పి జి ఆర్ ఎస్) సేవలను ఆగష్టు, 3వ తేదీ సోమవారం మండల, డివిజనల్ మరియు మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల కార్యాలయాల్లో, డివిజనల్ కార్యాలయాల్లో, లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చున్నారు.అలాగే, ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు, ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్: ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు



# పిజిఆర్ఎస్ సేవలపై పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

### ఆర్జీల స్థితిగతులను టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు - జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి




**ఏలూరు బ్యూరో చీఫ్, , ఆగష్టు,2 నంది పత్రిక:** ప్రజలకు మరింత పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించేదిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని , ఈ కార్యక్రమంలో భాగంగా పిజిఆర్ఎస్ ద్వారా అందించే సేవలపై ప్రజలను అభిప్రాయాలను కోరుతున్నదని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయి ని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను కోరుతుందన్నారు. పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ.ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. . క్యూ.ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పి.జి.ఆర్.ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని, సంతృప్తి స్థాయిని తెలియజేయవచ్చున్నారు. ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. క్యూ.ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ చేరుతుందని అన్నారు. ఆర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కలెక్టర్ వెట్రిసెల్వి ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన...

### కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...

**కొత్తపేట బ్యూరో చీఫ్ ఆగస్టు 2 నంది పత్రిక** పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం పొడగట్లపల్లి, లక్ష్మీ పోలవరం గ్రామాల్లో రెండేళ్ల అభివృద్ధి, నమ్మకం,సంక్షేమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలపై వివరాలు తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందన్నారు.'సూపర్ సిక్స్' హామీల అమలుతో రాష్ట్ర ప్రజల్లో విశ్వాసం పెరిగిందని చెప్పారు. సామాజిక భద్రతా పింఛన్లను రూ.4 వేల నుంచి వివిధ కేటగిరీల వారికి రూ.6 వేల, రూ.10 వేల, రూ.15 వేల వరకు పెంచడం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. అలాగే 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో చదువుతున్న ప్రతి విద్యార్థి కోసం తల్లికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని, 'దీపం-2' పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు.'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆటో డ్రైవర్లకు ఏటా ఆర్థిక సాయం, 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు రూ.20 వేల వరకు పెట్టుబడి సాయం అందిస్తున్నామని వివరించారు. అదే విధంగా పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను విస్తరిస్తున్నామని, రైతుల హక్కులను కాపాడే ఉద్దేశంతో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఎల్ నినో కారణంగా రైతులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ ఒక్కరూ క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, సచివాలయ సిబ్బంది అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు.



# వన దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

### జనసేన నాయకులు త్రిమూర్తులు కుటుంబం ప్రత్యేక మొక్కుబడి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీషాదేవి, తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్ రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి ఛైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



**విజయవాడ బ్యూరో చీప్ ఆగస్టు 2 నంది పత్రిక** ఏజెన్సీ ముఖద్వారం వైకుంఠపురం వన దుర్గాదేవి ఆలయంలో రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలేశ్వరం మండలం వైకుంఠ పురంలో రాజవొమ్మంగి జనసేన మండల పార్టీ అధ్యక్షులు బొదిరెడ్డి త్రిమూర్తులు కుటుంబ సమేతంగా ఆదివారం ప్రత్యేక మొక్కుబడి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆమె భర్త నియోజక వర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వన దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వన దుర్గాదేవి కోరిన కోరికలు తీర్చే మహిమ గల ఆలయమన్నారు. ఇక్కడకు మైదానప్రాంతం నుండి ఏజెన్సీ నుండి అనేకమంది భక్తులు మొక్కలు తీర్చుకునే ఒక విశిష్టత గల ఆలయమన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆమె జనసేన మండల పార్టీ అధ్యక్షులు త్రిమూర్తులు కుటుంబ సభ్యులు,శ్రేయోభిలాషులతో కలిసి భోజనం చేశారు. ప్రశాంతమైన వాతా వరణంలో ఇలా కాసేపు సరదాగా ఆధ్యాత్మికత్వంలో గడపటం చాలా మంచి అనుభూతి ఇస్తుందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బి ఎన్ వి ఎస్ గుప్తా మహిళలకు, పిల్లల కు ఫన్నీ సమాధానాల క్విజ్ అందరినీ ఆకట్టుకుంది. మరియు ఆధ్యాత్మికత్వం పై నిర్వహించిన క్విజ్ ఆసక్తికరంగా సాగింది. అలాగే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్,ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి గారు రెండు సంవత్సరాల కాలంలో సొంత నిధులతో చేసిన అభివృద్ధిపై నిర్వహించిన క్విజ్ అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఏపీఐఐసి డైరెక్టర్ మండల పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు గణజాల తాతారావు, ఏఎంసి డైరెక్టర్ కేశిరెడ్డి శివ శంకర వర ప్రసాద్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, మండల పార్టీ నాయకులు జెట్టి మధు, నియోజకవర్గ మహిళా విభాగం నాయకులు ముప్పన సావిత్రి, ముప్పన మోహన్, చిట్టి సుబ్బారావు, వానపల్లి చిట్టిబాబు, బచ్చా బుజ్జి సత్యనారాయణ, చెక్కా లోవరాజు, చిలకచర్ల వీరబాబు, జనసేన నియోజక వర్గ నాయకులు కుర్ల రాజశేఖర్ రెడ్డి, పాపోలు శ్రీనివాసరావు, కుప్పాల జయరాం, సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com